ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 19 ఏప్రిల్ 2024





దేవుళ్లకూ.. నైవేద్యం



పెనుమాక చెన్నకేశవస్వామి ఆలయం

- ఆలయాలను కరుణించని సీఆర్‌డీఏ
- కౌలు జాప్యంతో నిర్వహణ అస్తవ్యస్తం
- పస్తులుంటున్న పూజారుల కుటుంబాలు
- కౌలుతోనే మనుగడ.. పట్టించుకోని ప్రభుత్వం
- వచ్చే జూన్‌కు ఆలయాలకు కౌలు రాక రెండేళ్లు

మంగళగిరి, ఏప్రిల్ 18: రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులే కాదు.. భూములిచ్చిన పాపానికి దేవుళ్లను కూడా వైసీపీ ప్రభుత్వం శిక్షిస్తుంది. రాజధానికి భూములిచ్చిన రైతులు సకాలంలో కౌలు అందక అల్లాడుతున్నారు. కౌలు అందక అమరావతి ప్రాంతంలోని చిన్నాచితకా దేవాలయాల తాలూకు దేవుళ్లు కూడా రోజువారీ నైవేద్యానికి నోచుకోలేకపోతున్నారు. ఇక ఆ దేవాయాలపైనే ఆధారపడి జీవిస్తున్న పూజారులు కూడా జీవనానికి అల్లాడిపోతున్నారు. రాజధాని భూముల కు ఇవ్వాల్సిన కౌలు సొమ్ములను ఏపీ సీఆర్‌డీఏ చెల్లించకుండా తాత్సారం చేస్తున్నది. కౌలు సొమ్ములపైనే ఆధారపడి కొనసాగుతున్న రాజధాని అమరావతిలోని ఆలయాల మనుగడ కష్టంగా మారింది. రేపు జూన్ నాటికి సీఆర్‌డీఏ చెల్లించాల్సిన కౌలు రెండేళ్లకు చేరుతుంది.

2019 నుంచి చెల్లింపులకు బ్రేకులు

టీడీపీ హయాంలో 2016 నుంచి వరుసగా మూడేళ్లపాటు ఈ కౌలు ఆదాయాలు నిర్ణీతకాలానికి సంబంధిత రైతులు లేదా ఆలయాల తాలూకు దేవదాయశాఖ ఖాతాలకు జమవుతూ వచ్చినప్పటికీ 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కౌలు చెల్లింపులకు బ్రేకులు పడుతూ వచ్చాయి. దీంతో రైతులు ప్రతి ఏటా ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి కౌలు కోసం సీఆర్‌డీఏపై ఒత్తిడి తేవాల్సివస్తుంది. అయితే గత ఏడాది తాలూకు కౌలు ఆదాయాలు ఇంతవరకు ఆలయాల తాలూకు ఖాతాలకు జమ కాలేదు. దీంతో రాజధాని ప్రాంతంలోని ఆలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి పుష్కలంగా ఆదాయం ఉండడంతో కౌలు ఆలస్యమైనా ఎటువంటి ఇబ్బంది లేదు. కానీ చిన్నచిన్న ఆలయాలకు ఇతరాత్ర ఆస్తులు, ఆదాయ వనరులు లేని ఆలయాల పరిస్థితి, అక్కడ పని చేసే అర్చకుల పరిస్థితి దారుణంగా ఉంది. పండుగలు, ఉత్సవాల సంగతెలా ఉన్నా.. ఆయా దేవుళ్లకు రోజువారీ నైవేద్యానికి కూడా ఇబ్బందులు పడాల్సివస్తుందని పూజారులు వాపోతున్నారు. నైవేద్యంతో పాటుగా ఆలయాల పూజారుల జీతాలు ఆలయాల నిర్వహణ చూసే దేవదాయశాఖ సిబ్బంది జీతాలు సైతం నెలలతరబడినిలిచిపోయాయి. దీంతో పూజారులు, దేవదాయశాఖ సిబ్బందితోపాటు దేవుళ్లు సైతం సీఆర్‌డీఏ చెల్లించాల్సిన కౌలుకోసం ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ముందైనా ప్రభుత్వం తమపై కరుణచూపి కౌలు విడుదల చేయకపోతుందా అంటూ రాజధాని ప్రాంత రైతులతో పాటు దేవుళ్లు కూడా ఆశిస్తున్నారు.

దేవుడి భూములు 1100 ఎకరాలు

ప్రస్తుత రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాల్లో తొంభైతొమ్మిది శాతం ఆలయాలు దాతలు దానంగా రాసిచ్చిన మాన్యాలపైనే ఆధారపడి కొనసాగేవి. అయితే ఈ గ్రామాల్లోని రైతులతో పాటు ఆలయాల కింద ఉన్న సుమారు 1100 ఎకరాల దేవుడి మాన్యాలను కూడా దేవదాయశాఖ భూసమీకరణ కింద సీఆర్‌డీఏకు ఇచ్చేసింది. ఇందులో ఒక్క మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం తాలూకు భూములే 88 ఎకరాల వరకు ఉన్నాయి. మందడం గ్రూపులోని 30 ఆలయాల కింద ఉన్న 431.17 ఎకరాలను భూసమీకరణలో భాగంగా సీఆర్‌డీఏకి ఇచ్చారు. పెనుమాకలోని చెన్నకేశవస్వామి దేవస్థానం 12.41 ఎకరాలు సీఆర్‌డీఏకి ఇచ్చింది. మంగళగిరి దేవస్థానాల కింద 32 ఎకరాలు, కాజ గ్రూపు దేవస్థానాల కింద 47 ఎకరాలు ఇచ్చారు. మిగతా ఆలయాల విషయానికొస్తే నాలుగైదు ఎకరాల వంతున ఉంటాయి. ఈ భూములకు కౌలు కింద ఏటా సాధారణ భూములకు రూ.30 వేలు, జరీబు భూములైతే రూ.50 వేల వంతున చెల్లిస్తున్నారు. ఈ కౌలును ఏటా పదిశాతం వంతున హెచ్చించి చెల్లించేలా సీఆర్‌డీఏ ఒప్పందాలు చేసుకుంది.



జీతాలు అందక ఆస్పత్రిలో చేరిన పెనుమాక చెన్నకేశవ స్వామి ఆలయ అర్చకుడు ప్రసాదాచార్యులు

ఆర్‌వో కార్యాలయాల వద్ద హెల్ప్‌డెస్క్‌లు

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన కలెక్టర్

బాపట్ల, ఏప్రిల్ 18: జిల్లాలోని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ, శాసనసభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ 25 వరకు జరుగుతుందన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయవచ్చని చెప్పారు. ఎన్నికల నిబంధనలను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా అనుసరించాలన్నారు. నామినేషన్ ప్రక్రియ ప్రారంభం నుంచి స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లు పనిచేస్తాయన్నారు. జిల్లాలో 1510 పోలింగ్ కేంద్రాలు ఉండగా సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ నిఘా ఉంచుతామన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా 374 ఫిర్యాదులు రాగా 43 నిమిషాల్లోనే పరిష్కరించినట్లు తెలిపారు. హోమ్ ఓటింగ్ కొరకు దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వారిని గుర్తించి వారి ఇంటికెళ్లి దరఖాస్తులను పంపిణీ చేశామని తెలిపారు. 22 లోగా ఆయా దరఖాస్తులను ఆర్‌వోలకు అందిస్తే మే నెల 3 నుంచి 10వ తేదీలోగా హోమ్ ఓటింగ్‌కి చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటింటికి ఓటర్ స్లిప్‌లు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

జిల్లా పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక దృష్టితో చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆయా గ్రామాల్లో బీఎస్‌ఎఫ్ దళాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. పాతనేరస్థులు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. చట్ట వ్యతిరేక కార్యాకలాపాల్లో పాల్గొనకుండా వివిధ రాజకీయపార్టీలకు చెందిన 8,819 మందిని బైండోవర్ చేశామన్నారు. జిల్లాలో మొత్తం 137 లైసెన్స్ కలిగిన తుపాకులు ఉండగా వాటిలో 98 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలినవి బ్యాంకింగ్ సెక్యూరిటీ సిబ్బంది వద్ద ఉన్నాయన్నారు. జిల్లాలో 12 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, 24 గంటలు వాహన తనిఖీలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికల నియమావళి అమలలోకి వచ్చినప్పటి నుంచి రూ.3.17 కోట్ల సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్

విలీనం.. వంచన



ఆశ.. నిరాశ

తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచింది అన్నట్లుగా ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి తయారైంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నది కార్మికుల కల. ప్రభుత్వంలో విలీనమైతే తమకున్న కష్టాలన్నీ తీరిపోతాయని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, ప్రయోజనాలు అందుతాయని ఆశ పడ్డారు. అందుకోసం విలీనం చేయాలని ఉద్యమాలు కూడా చేశారు. అధికారం చేపట్టిన కొద్దిరోజుల్లోనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ వైసీపీ పాలకుల నిర్ణయంతో ఉద్యోగులంతా సంబరాలు చేసుకున్నారు. ఆ సంబరాలు, వారి ఆనందం ఎంతోకాలం నిలవలేదు. విలీనం కోరుకుని ఎంత పెద్ద తప్పు చేశారో తెలియడానికి వారికి అట్టే సమయం పట్టలేదు. విలీనం వల్ల తమకు వీసమెత్తు ప్రయోజనం కలగకపోగా, అప్పటికే ఉన్న అన్ని ప్రయోజనాలు కోల్పోయారు.

ఆర్టీసీ కార్మికులు.. విలీనంతో ఉద్యోగులయ్యారు. ప్రభుత్వంలో విలీనమైతే ఎంతో మేలు జరుగుతుంది.. తమ జీవితాలు బాగుపడతాయి.. ఆర్టీసీ కార్మికులుగా అనుభవించిన కష్టాలన్నీ దూరమవుతాయని భావించారు. అయితే మేలు కంటే కష్టాలు.. నష్టాలు ఎక్కువగా ఉండటంతో విలీనం పేరుతో తమను ప్రభుత్వం వంచించిందని వాపోతున్నారు. విలీనంతో గతంలో ఆర్టీసీ కార్మికులుగా దక్కించుకున్న కార్మిక చట్టాలు, హక్కులు, సంక్షేమ పథకాలన్నింటినీ కోల్పోయారు. సరే జీతాలన్నా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఉంటున్నాయా అంటే అదీ లేదు. దీంతో ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి పెనంమీద నుంచి పొయ్యిలోకి పడిన చందంగా మారింది. కార్మికులు తల చింది ఒకటికాగా విలీనం పేరుతో వైసీపీ ప్రభుత్వం చేసింది మరొకటి. దీంతో ఉద్యోగులుగా మారిన కార్మికులు విలవిలలాడిపోతున్నారు. విలీనం పేరుతో ప్రభుత్వం ఆడిన నాటకంలో తాము బలిపశువులుగా మారిపోయామని ఆర్టీసీ ఉద్యోగులు వాపోతున్నారు.

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు కోరినట్లుగా ప్రభుత్వంలో విలీనం చేస్తున్నామని వైసీపీ అధినేత జగన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత ప్రకటించారు. దీంతో ఆర్టీసీ కార్మికులు జగన్‌కు క్షీరాభిషేకాలు చేశారు. విలీనంతో తమ జీవితాలు బాగవుతాయని ఆర్టీసీ కార్మికులు భావించారు. అయితే విలీనం పేరుతో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తమ జీవితాలతో చెలగాటమాడుతున్నారని తొలుత వారు భావించలేదు. రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వం విలీనం చేయడం వెనుక కంటికి కనపడని వంచన ఉందని ఉద్యోగులు లేటుగా తెలుసుకున్నారు. విలీనమైన తర్వాత ఒక్కో ప్రయోజనం కోల్పోవాల్సి వచ్చింది. ఒక పీఆర్సీని కోల్పోవడమే కాకుండా, పాత జీతాలతోనే సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. దానికి తోడు అప్పటి వరకూ వారికి వర్తించిన కార్మిక చట్టాలు, ట్రేడ్ యూనియన్ హక్కులు, సంక్షేమ పథకాలు అన్నీ రద్దయిపోయాయి. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతి నాలుగేళ్లకు ఒకసారి వేతన సవరణ (పీఆర్సీ) అమలు జరుగుతుంది. 2017లో వారికి వేతన సవరణ జరగ్గా 2020-21లో మరోమారు సవరణ జరగాలి. అయితే విలీనంతో ఆర్టీసీ ఉద్యోగులంతా ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు కాబట్టి వారికి ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ అమలవుతుందని చెప్పి ఆర్టీసీలో జరగాల్సిన పీఆర్సీని ఎగవేశారు. ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ అనగానే 19 శాతం తక్కువగా ఉన్న తమ వేతనాలు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెరుగుతాయని ఆశపడ్డారు. కానీ ప్రభుత్వం వారికి టోకరా ఇచ్చింది. ఉద్యోగులకు ఆర్టీసీలోని ఉద్యోగ హోదాతో సమానంగా ప్రభుత్వ ఉద్యోగుల పే స్కేలు ఇవ్వకుండా, వారికన్నా తక్కువ హోదాలో ఉండి వారితో సమానంగా వేతనం పొందే ఉద్యోగుల పే స్కేలుతో సమానం చేసింది. దీంతో తక్కువ హోదా వున్న ఉద్యోగుల జీతాలతో వారు సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. ఫలితంగా ఆర్టీసీ ఉద్యోగులకు 2019 నాటి వేతనాలతోనే సరిపుచ్చుకోవాల్సి వస్తోంది.

పేరుకే ఉద్యోగులు.. సెలవులు లేవు

ఆర్టీసీ ఉద్యోగులను పేరుకే ఉద్యోగులుగా చెబుతున్న ప్రభుత్వం వారిని విధుల్లో మాత్రం కార్మికులుగానే చూస్తోంది. వారికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సెలవులు ఇవ్వకుండా కంపెనీల చట్టం కింద వారికి ఐదు సెలవులే వర్తిస్తాయని సెలవులు ఎగ్గొట్టారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులు అయ్యారనే నెపంతో కార్మిక చట్టాలు, సమ్మె హక్కులు వర్తించవంటూ కార్మికుల హక్కులను కాజేశారు. దీంతో వారు తమ సమస్యలపై ఆందోళన చేసే హక్కును కూడా కోల్పోవాల్సి వచ్చింది.

మేలు కంటే కష్టాలే అధికం

- హక్కులు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులు
- పెనం మీద నుంచి పొయ్యిలోకి ఉద్యోగులు
- గత ప్రయోజనాలతో పాటు ఓ పీఆర్సీ నష్టం
- కార్పొరేషన్లో ఉన్న హక్కులు, స్కీములన్నీ రద్దు
- హెల్త్ స్కీము రద్దుతో తీవ్ర ఇబ్బందుల్లో కార్మికులు
- పాత జీతాలతోనే పీఆర్సీ కలరింగ్.. నేటికీ వేతన వ్యత్యాసం

పాత స్కీములన్నీ రద్దు..

ఆర్టీసీ కార్పొరేషన్‌గా ఉన్న సమయంలో ఉద్యోగులకు హెల్త్ స్కీము అమలు జరిగేది. ఈ స్కీము కింద ఎంత తీవ్రమైన అనారోగ్యం వచ్చినా ఉద్యోగులకు ఉచితంగా వైద్యం లభించేంది. దాదాపు 30 లక్షల రూపాయల వరకూ విలువైన వైద్యం కూడా ఉద్యోగులు పొందిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఉద్యోగులు ప్రతి నెలా రూ.225 చెల్లించి ఈహెచ్‌ఎస్ కార్డు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. వైద్య పరీక్షలన్నీ సొంతంగానే చేయించుకోవాల్సి వస్తోందని ఉద్యోగులు చెబుతున్నారు. ఎస్సార్బీసీ కింద ప్రతి నెలా ఉద్యోగుల రూ.300 పొదుపు చేసుకుని దాని ద్వారా పిల్లల చదువులకు రుణాలు తీసుకునేవారు. విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ కల్పించేవారు. ఇప్పుడు ఈ పథకాన్ని కూడా ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో విశ్రాంత ఉద్యోగులకు గతంలో వచ్చే పెన్షన్ కూడా దక్కకుండా పోయింది. విరమణ అనంతరం వారు ఒట్టి చేతులతోనే ఇళ్లకు పోవాల్సిన దుస్థితి నెలకొంది.



ఆర్థికంగా నష్టపోయాం

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల తీవ్రంగా నష్టపోయాం. వేతనాలు ప్రభుత్వ ఉద్యోగులతో సమానం కాకపోగా, కార్పొరేషన్ ద్వారా వచ్చే అనేక ప్రయోజనాలు కోల్పోయాం. ఈహెచ్‌ఎస్ హెల్త్‌కార్డు ఎందుకూ పనికిరావడం లేదు. విలీనం వల్ల ఘోరంగా నష్టపోయాం.

- ఓ కార్మిక సంఘం నేత గుంటూరు

ఆందోళనలో ఉద్యోగులు

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతి నాలుగేళ్లకు ఒకసారి పీఆర్సీ ఉంటుంది. విలీనంతో ఈ పీఆర్సీ ఐదేళ్లకు పెరిగింది. పదేళ్లకు మారే అవకాశం ఉందని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో ఉద్యోగులు మరింత ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల కంటే డీఏ 8 శాతం వీరికి తక్కువగా ఉంది. ప్రభుత్వ వంచనతో ఉద్యోగులు అది కూడా కోల్పోయామని వాపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు 2018 జనవరి 1 నుంచి వేతన స్కేలు అమలు చేయగా, ఆర్టీసీ ఉద్యోగులకు 2022 జనవరి 1 నుంచి అమలు చేశారు. ఈ మధ్యకాలంలో కార్మికులకు రావాల్సిన డీఏలన్నీ ఇవ్వకుండా ఎగవేసిందని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన కారణంగా గృహ అలవెన్స్(హెచ్‌ఆర్‌ఏ) 4 శాతం వరకూ తగ్గిందని ఉద్యోగులు వాపోతున్నారు. నగరాల్లో హెచ్‌ఆర్‌ఏ 16 నుంచి 12 శాతానికి, గ్రేడ్ 1 మున్సిపాలిటీల్లో 14.5 శాతం నుంచి 12 శాతానికి తగ్గిందని ఆవేదన చెందుతున్నారు. కార్పొరేషన్లో ఉండగా ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు వచ్చేవని, పండుగ సమయాల్లో ఐదారు రోజులు ముందు గానే వేతనాలు పడేవని, ఇప్పుడవన్నీ కలగా మారిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వంలో విలీనం కాకుండా ఉంటే 2020-21లో మరో పీఆర్సీ అమలు జరిగేదని, దానివల్ల ఇంతకంటే మెరుగైన వేతనాలు అమలు జరిగేవని చెబుతున్నారు.

ప్రాజెక్టులన్నీ.. పెండింగే



- అడుగు ముందుకు పడని ఫిషింగ్ హార్బర్ నిర్మాణం



ఫైర్ ఆఫీస్ సమీపంలోని రైల్వేగేటు పడటంతో ఆగి ఉన్న వాహన చోదకులు

- జగన్ హామీలకు దిక్కేలేదు
- శంకుస్థాపన దశ దాటని ఫిషింగ్ హార్బర్
- నత్తతో పోటీ పడుతున్న కుందేరు పనులు
- ప్రతిపాదనల్లోనే చీరాల ఆర్‌వోబీ నిర్మాణం

చీరాల, ఏప్రిల్ 18: వైసీపీ పాలనలో చీరాల నియోజకవర్గ పరిధిలో మెగా ప్రాజెక్టులు ఒక్కటి కూడా మొదలు కాలేదు. సుమారు రూ.700 కోట్లకు పైబడి పనులు జరగాల్సి ఉండగా అన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. శంకుస్థాపనతోనే ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని సరిపెట్టగా, కుందేరు పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. చీరాల మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారం రెండో ఎస్.ఎస్ (సమ్మర్ స్టోరేజీ) ట్యాంక్ నిర్మాణం స్థలం పరిశీలనకే పరిమితం అయింది. కోట్లు వెచ్చించి నిర్మించిన హ్యాండ్లూమ్ క్లస్టర్లు, శిక్షణ కేంద్రాలు అలంకారప్రాయంగా మిగిలాయి. దశాబ్దాలుగా ఆటోనగర్ ఊరిస్తూనే ఉంది.

- వాడరేవులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ఇదిగో అదిగో అంటూ ఊరిస్తున్నారు. గత ఏడాది జగన్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రూ.451 కోట్లతో డీపీఆర్ తయారు చేశారు. టెండర్లు పూర్తయ్యాయి. అందులో కేంద్రం వాటా 70 శాతం, రాష్ట్రం వాటా 30 శాతం. వాడరేవులో నిర్మాణ ప్రదేశ స్థలానికి సంబంధించిన అంశం కొంత కోర్టులో నడుస్తోంది. అది పరిష్కారమైతే పనులు ప్రారంభిస్తామని పాలకులు ఊరిస్తున్నారు.
- చీరాలలోని ఫైర్ ఆఫీస్ సమీపంలోని రైల్వే లెవల్ క్రాసింగ్‌పై ఆర్వోబీ నిర్మాణ హామీ అమలుకు నోచుకోలేదు. తొలుత రూ.63 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం పెరిగిన ఎస్ఎస్ఆర్ రేట్లు ప్రకారం రివైజ్డ్ బడ్జెట్ రూ.100 కోట్లకు పైబడి ఉంటుందని సమాచారం. కేంద్ర ప్రభుత్వ నిధులు సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వ నిధుల కొరతతో అది ఆగిందని కొందరు అంటున్నారు.
- కాలుష్య కాసారానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉండే కుందేరు అభివృద్ధికి సుమారు రూ.73 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఆ పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. నిధుల కొరతతో ఆ పనులు కుంటుపడుతున్నాయని సమాచారం.
- చీరాలలో చేనేత వృత్తిపై జీవించేవారు ఎక్కువ. మగ్గం పని వారికి ఆధారం. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన క్లస్టర్లు, శిక్షణ కేంద్రాలు అలంకారప్రాయంగా మిగిలాయి. దీంతో నేతన్నలకు సరైన శిక్షణ లేక ఎప్పటికప్పుడు మారుతున్న అభిరుచులకు అనుగుణంగా వినియోగదారులను మెప్పించే రీతిలో వస్త్రోత్పత్తి చేయలేక నష్టపోతున్నారు. దీంతో మగ్గం పనే జీవనాధారంగా ఉన్నవారు మూడు పూటలా తిండికి సంపాదన సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చేనేత పార్కు కోసం కేటాయించిన 50 ఎకరాల స్థలంలో నిర్మాణ పనులు ఆగడం, అప్పట్లో హ్యాండ్లూమ్ ఏడీగా పనిచేసిన సత్యనారాయణరాజు సుమారు రూ.3 కోట్ల మేర చేసిన అవినీతి వెరసి అన్నీ తమకు శాపాలుగా మారాయని వారు వాపోతున్నారు.
- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఎన్నికల ప్రచార సభల్లో ఇచ్చిన హామీల్లో కొన్నే పూర్తయ్యాయి. చీరాల మండలం ఈపూరుపాలెం పరిధిలో ఆటోనగర్ పనుల్లో అంతర్గత రోడ్లు వేయడంతో చిన్నపాటి కదలిక వచ్చినా తర్వాత ఆ పనులూ ఆగిపోయాయి.



క్లస్టర్‌లో నామ్‌కే వాస్తేగా ఏర్పాటు చేసిన మగ్గాలు

తొలిరోజు పదకొండు నామినేషన్లు

- అసెంబ్లీకి 9, లోక్‌సభ స్థానాలకు రెండు

బాపట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ల ఘట్టానికి తొలిరోజైన గురువారం పదకొండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో అసెంబ్లీకి 9, లోక్‌సభ స్థానానికి రెండు నామినేషన్లు ఉన్నాయి. బాపట్ల అసెంబ్లీ స్థానానికి ఆరుగురు అభ్యర్థులు నామినేషన్ వేయగా, ఇందులో ఒకరు రెండు సెట్లు దాఖలు చేశారు. వైసీపీ తరపున ఎమ్మెల్యే కోన రఘుపతితో పాటు ఆయన సతీమణి రమాదేవి కూడా నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా కటికల శివభాగ్యారావు, దోనేపాటి షాలిని, పిరమిడ్ పార్టీ తరపున దేవరకొండ రాజేశ్వరరావు, బహుజన సమాజ్ పార్టీ తరపున గుదె రాజారావు రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. చీరాల, పర్చూరు అసెంబ్లీ స్థానాలకు ఒక్కో నామినేషన్ దాఖలైంది.

గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే

12 నెలలుగా వేతనాలు పెండింగ్ • పనులు నిలిపేసిన స్వచ్ఛభారత్ కార్మికులు

రేపల్లె, ఏప్రిల్ 18: గ్రామాల్లో ఎక్కడెక్కడ చెత్త అక్కడే ఉంది. ఇంటింట చెత్త సేకరణ నిలిచిపోయింది. అపరిశుభ్రతతో గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్మికులకు 12 నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. దీంతో వారు పారిశుధ్య విధులకు గైర్హాజరవుతున్నారు. దీంతో రోడ్లపైన, ఇళ్లల్లోనూ చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. జిల్లాలోని రేపల్లె, వేమూరు, బాపట్ల, పర్చూరు, అద్దంకి, చీరాల నియోజకవర్గాల్లో 1800 చెత్త సేకరించే పారిశుధ్య వాహనాలు మూలకు చేరాయి. ఒక్కొక్క వాహనానికి ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు స్వీపర్లు ఉన్నారు. వీరికి మేజర్ పంచాయతీల్లో డ్రైవర్లకు రూ.10 వేలు, స్వీపర్లకు రూ.6 వేలు, చిన్న పంచాయతీల్లో డ్రైవర్లకు రూ.8 వేలు, స్వీపర్లకు రూ.6 వేలు ఇవ్వాలి. అయితే కొన్ని నెలలుగా డ్రైవర్లు, స్వీపర్లకు జీతాలు ఇవ్వడంలేదు. దీంతో తాము పనులు చేయలేమంటూ జిల్లా వ్యాప్తంగా కార్మికులు విధులకు గైర్హాజరవుతున్నారు. ఇంటింటికి రూ.100 చొప్పున పన్ను కట్టించుకుంటున్నా చెత్త తొలగించడంలేదని గ్రామీణులు మండిపడుతున్నారు. గతంలో పంచాయతీలకు స్వచ్ఛభారత్ నిధులు మంజూరయ్యేవని ఆరునెలలుగా నిలిచిపోయాయని కార్యదర్శులు తెలిపారు.



గుళ్ళపల్లిలో మూలనపడిన చెత్త తరలించే వాహనాలు

కూటమితోనే అమరావతి కల సాకారం

- కూటమితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు స్వర్ణయుగం
- నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు
- పేదలకు రెండు సెంట్ల స్థలం : జీవీ ఆంజనేయులు
- గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



కారుమంచిలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

శావల్యాపురం, ఏప్రిల్ 18: ఆంధ్రుల ఏకైక రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులను టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అధికారంలోకి రాగానే పూర్తిచేసి ఐదేళ్లలో ప్రజల కలల్ని సాకారం చేస్తామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శావల్యాపురం మండలంలోని గుంటుపాలెం, వయ్యకల్లు, కారుమంచి గ్రామాల్లో బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారానికి వెళ్ళిన ఎంపీ లావు, మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెనలకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు ఎదురెళ్ళి నేతలకు హారతులిచ్చి సాదరంగా గ్రామాల్లోకి ఆహ్వానించారు. కారుమంచి ఎన్టీఆర్ కూడలిలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి మొత్తం రాజధానితో ముడిపడి ఉందని, అమరావతిని అభివృద్ధి చేసి పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించగల సత్తా చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే గత ఐదేళ్ళుగా నిలిచిపోయిన ఎత్తిపోతల పథకం, పల్నాడు వాటర్‌గ్రిడ్‌లను పునఃప్రారంభించి గోదావరి జలాలతో రైతులకు రెండు పంటలకు సాగునీరు, ఇంటింటికీ కొళాయిలు వేసి ప్రజలందరికీ తాగునీరు అందిస్తామన్నారు. కూటమితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు స్వర్ణయుగం రానుందని, 50 ఏళ్ళు నిండినవారికి రూ.4 వేలు ఫించన్‌లు అందించనున్నామని, అన్ని వర్గాలకు కార్పొరేషన్‌లు పెట్టి రాయితీలపై రుణాలిచ్చి వారిని ఆదుకొంటామన్నారు. కారుమంచి వద్ద ఏబీసీ కెనాల్‌పై శిథిలావస్థలోనున్న బ్రిడ్జిని పునర్ నిర్మాణం చేయిస్తామని హామీనిచ్చారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, వినుకొండ ఎన్ఎస్‌పీ కాలనీలో పార్కు, స్టేడియం నిర్మాణాలు, కొండపైకి వెళ్ళే ఘాట్‌రోడ్డుకు తారురోడ్డు నిర్మిస్తామని, భక్తుల సహకారంతో రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయిస్తానన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ఎన్టీఆర్ కాలనీలు వేసి పేదలందరికీ రెండుసెంట్లు చొప్పున స్థలాలిచ్చి ఇళ్ళు కట్టిస్తామని, ఇంటి బిల్లులు రానివారందరికీ బిల్లులు ఇప్పిస్తామన్నారు. ఎమ్మెల్యేగా బొల్లా చేసిన అక్రమాలపై బట్టబయలు చేసి ఆయన్ని జైలుకు పంపడం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ వినుకొండకు పదిమంది ఎమ్మెల్యేలుగా చేసినా బొల్లా మాత్రమే అభివృద్ధి చేసినట్లుగా గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన బొల్లా ప్రెస్‌మీట్లలోనే వినలేనిబూతులు మాట్లాడి బూతుల ఎమ్మెల్యేగా మారాడని, రానున్న ఎన్నికల్లో ప్రజలంతా బొల్లాకు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. అనంతరం కారుమంచిలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 30కుటుంబాల వారికి నేతలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, జనసేన మండల అధ్యక్షులు అడపాల అనిల్‌కుమార్, నాయకులు యరమాసు కోటేశ్వరరావు, గడిపూడి విశ్వనాథం, గోనుగుంట్ల వెంకట్రావు, కోట హరిబాబు పాల్గొన్నారు.



కూటమి అభ్యర్థులకు హారతులిస్తున్న మహిళలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

- గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని
- తెనాలి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లతో కలసి ఎన్నికల ప్రచారం
- రోడ్‌షోకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు



రోడ్‌షోలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన మనోహర్, ఆలపాటి

కొల్లిపర, ఏప్రిల్ 18: రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడాలని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. గురువారం మండల కేంద్రం కొల్లిపరలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల అభ్యర్థి నాదెండ్ల మనోహర్, పెమ్మసాని చంద్రశేఖర్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. స్థానిక వీరభద్రస్వామి కాలనీ నుంచి బయలు దేరిన ర్యాలీ గ్రామ పురవీధుల్లో కొనసాగింది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రోడ్‌షోలో చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి, దోపిడి పాలన కొనసాగుతోందన్నారు. కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు జరిపి భారీ వాహనాల ద్వారా తరలిస్తున్నారని దీంతో రోడ్లుకూడా గుంతలమయింగా మారినట్లు తెలిపారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గతంలో తాను శాసనసభ్యునిగా పని చేసినప్పుడు తెనాలి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించానన్నారు. అరాచపాలన నుంచి రాష్ట్రం విముక్తి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యంత మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం నేడు ఎంతైన ఉందని మనోహర్ స్పష్టం చేశారు.

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పెమ్మసాని చంద్రశేఖర్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి, తెనాలి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాదెండ్ల మనోహర్‌కు గ్లాసు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందన్నారు. అనంతరం కొద్ది మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రోడ్‌షోలో జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు యర్రు వెంకయ్యానాయుడు, టీడీపీ తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు లంకకోటిరెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థులకు ఘనస్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

టీడీపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి
- పెమ్మసాని సతీమణి డాక్టర్ శ్రీరత్న

మేడికొండూరు: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించాలని గుంటూరు పార్లమెంట్ నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి డాక్టర్ శ్రీరత్న విజ్ఞప్తి చేశారు. గుంటూరు రూరల్ మండలం, చల్లావారిపాలెంలోని అపార్ట్‌మెంట్‌లలో డాక్టర్ శ్రీరత్న గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. గుంటూరు పార్లమెంట్ నియోజక వర్గంలో ఎంపీగా తన భర్త డాక్టర్ చంద్రశేఖర్‌ను, ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి రామాంజనేయులును గెలిపించాలని కోరారు. డాక్టర్ శ్రీరత్నకు మహిళలు హారతులిచ్చి ఆహ్వానించారు. కార్యక్రమంలో రావిపాటి మోహనరావు, చింతా అనూష, స్వర్ణ బాబు, జనసేన నేతలు సూరిశెట్టి హరీష్, సూదా పిచ్చయ్య, బీజేపీ నేతలు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీరత్నకు స్వాగతం పలుకుతున్న చల్లావారిపాలెం వాసులు

వ్యవసాయానికి విద్యుత్ మీటర్లు

- వైసీపీ స్టిక్కర్లు తొలగించి మీటర్లు బిగింపు

పిడుగురాళ్ళ, ఏప్రిల్ 18: పల్నాడుజిల్లా పిడుగురాళ్ళ మండలం వీరాపురంలో రెండు రోజులుగా వ్యవసాయ బోర్ల వద్ద ప్రభుత్వం విద్యుత్ మీటర్లను అమర్చుతుంది. మీటర్లు వద్దు బాబోయ్.. అంటూ రైతులు మొత్తుకుంటున్నా వినకుండా వ్యవసాయశాఖ ఆ పనిలో నిమగ్నమైంది. సాగుకి మీటరు వద్దన్న వారికి ఇంటి కనెక్షన్‌ను తొలగించి వేస్తామంటూ అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.



వీరాపురంలో రైతు పొలంలో అమర్చిన విద్యుత్ మీటర్

కౌలు రైతు ఆత్మహత్య

చుండూరు ఏప్రిల్ 18 : అప్పుల బాధ తట్టుకోలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాపట్లజిల్లా చుండూరు మండలం మోదుకూరులో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన పులి వెంకటేశ్వర్లు (55) సొంత భూమి లేకపోవడంతో ఈ ఏడాది 10, అందకు ముందు 5 ఎకరాలు కౌలుకి సాగుచేశాడు. కొద్ది సంవత్సరాలుగా సరైన దిగుబడులు లేక, గిట్టుబాటు ధరలు లేక తుఫాన్ ప్రభావంతో వెంకటేశ్వర్లు రూ.10-15 లక్షల మేరా అప్పుల పాలయ్యాడు. కౌలు డబ్బుల కోసం ఒత్తిడి పెరిగిపోవడంతో తీర్చేమార్గం లేక అవమాన భారంతో బుధవారం పురుగు మందుతాగాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.



పులి వెంకటేశ్వర్లు (ఫైల్)

ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరిస్తాం

- చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 18: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరిస్తామని మాజీమంత్రి, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. పవిత్రమైన వృత్తిలో ఉంటూ గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యమిత్రలుగా నిలుస్తున్న వారిని కాపాడుకొని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఆర్ఎంపీ, పీఎంపీల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రత్తిపాటి మాట్లాడుతూ ఇప్పటికే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూడా వారికి మెరుగైన శిక్షణ, గుర్తింపు కార్డులు అందిస్తామని చెప్పారని గుర్తు చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత వంద రోజుల్లో ఆ హామీ అమలు చేస్తామని, కూటమి విజయంకోసం ఆర్ఎంపీలు, పీఎంపీలు కృషి చేయాలని ప్రత్తిపాటి పిలుపు నిచ్చారు. నియోజకవర్గాన్ని తాను అభివృద్ధి చేసినట్లుగా ఎవ్వరూ అభివృద్ధి చేయలేదని, ఒక్క ఛాన్స్ అన్న మాట విని విడదల రజినికి అవకాశం ఇస్తే ఐదు సంవత్సరాలు నియోజక వర్గాన్ని పట్టించు కోలేదని, దోచుకొని పారిపోయారని మండి పడ్డారు. నాసిరకం మద్యంతో ఏడాదికి రూ.30వేల కోట్ల చొప్పున ఐదు సంవత్సరాల్లో రూ.1.50 లక్షల కోట్లు దోచేశాడని, ఈ మద్యం వల్ల ప్రజల కాలేయం, కొమ్మగ్రంధి దెబ్బతిని ఆస్పత్రుల పాలయ్యే వారి సంఖ్య పెరుగుతుందని, అందులో సమిధలుగా మారుతుంది బడుగు, బలహీన వర్గాల నిరు పేదలేనని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాదిలో నాలుగైదు సార్లు బటన్‌లు నొక్కాడని, కాని ఎవ్వరికీ ఖాతాలో ఇప్పటి వరకు డబ్బు పడ లేదన్నారు. ఈ మోసగాడి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించటానికి మీరంతా కంకణం కట్టుకోవాలని, సైకిల్ గుర్తుపై ఓట్లు వేయించి తెలుగుదేశం కూటమి అభ్యర్థులను శాసన సభకు నన్ను, పార్లమెంట్‌కు శ్రీ కృష్ణ దేవరాయలను అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రత్తిపాటి కోరారు.



ఆర్ఎంపీ, పీఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న పత్తిపాటి పుల్లారావు



ఏసీబీకి చిక్కిన సీఆర్‌డీఏ అధికారులు చంద్రశేఖర్‌రావు, రాజేంద్రసాయినాథ్

ఏసీబీ వలలో సీఆర్‌డీఏ అధికారులు

- బిల్డింగ్ అప్రూవల్ కోసం రూ.30వేల లంచం డిమాండ్
- పట్టుబడిన జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్

తెనాలి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కోసం లంచం డిమాండ్ చేసిన ఇద్దరు సీఆర్‌డీఏ అధికారులను గుంటూరు రేంజి ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ అదనపు ఎస్పీ మహేంద్ర మత్తే తెలిపిన వివరాల ప్రకారం... చేబ్రోలు మండలం వడ్లమూడికి చెందిన రత్నబాబు అనే వ్యక్తి తన బంధువు ఇంటి నిర్మాణానికి సంబంధించి బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. తెనాలి ఉడా కాలనీలో ఉన్న సీఆర్‌డీఏ జోనల్ కార్యాలయానికి ఎంత తిరిగినా పని కాకపోవటంతో అధికారులను వేడుకుంటే రూ.30వేలు లంచం డిమాండ్ చేశారని తెలిపారు. అన్ని అర్హతలున్నా లంచం డిమాండ్ చేయటం, రోజుల తరబడి తిప్పుతుండటంతో విసిగిపోయిన రత్నబాబు ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ డీజీ రాజేంద్రనాద్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు రేంజి ఏసీబీ అధికారుల బృందం గురువారం తెనాలిలోని సీఆర్‌డీఏ జోనల్ కార్యాలయంలో నిఘా వేశారు. రత్నబాబు తరపున వెళ్లిన ఒక ప్రైవేట్ ప్లానింగ్ చూసే వ్యక్తి నుంచి రూ.30వేలు లంచం తీసుకుంటుండగా ఇరువురు అధికారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు అదనపు ఎస్పీ తెలిపారు. కార్యాలయంలో జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న లేళ్ల చంద్రశేఖరరావు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఘంటా రాజేంద్రసాయినాద్‌లను పట్టుకున్నట్టు చెప్పారు. దాడిలో ఏఎస్పీ మహేంద్ర మత్తేతో పాటు డీఎస్పీలు సత్యానంద్, ప్రతాప్‌కుమార్, మరో ఆరుగురు ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 916 క్యూసెక్కులు

దుగ్గిరాల, ఏప్రిల్ 18: కృష్ణాపశ్చిమ డెల్టాకు 916 క్యూసెక్కుల నీటిని గురువారం విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజివద్ద 6.4 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వ 394 క్యూసెక్కుల నీరు, నిజాంపట్నం కాల్వకు 265 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

ఉద్దండ్రాయునిపాలెం ఘటనపై ఫిర్యాదు

- విచారణకు నలుగురు అధికారులతో కమిటీ

తుళ్ళూరు, ఏప్రిల్ 18: ఉద్దండ్రాయుపాలెం రాజధాని శంఖుస్థాపన ప్రదేశంలో ఏర్పాటు చేసిన మ్యూజియంలో గుర్తు తెలియని వ్యక్తులు నమూనాలు ధ్వంసం చేసిన ఘటనపై ఏపీ సీఆర్డీఏ కమీషనర్ వివేక్ యాదవ్ నలుగురు సభ్యులతో కూడిన అధికారుల కమిటీని నియమించారు. కమిటీ బృందం గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించింది గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన నమూనాలు పాక్షికంగా దెబ్బతిన్నట్టు గుర్తించారు. ఈ ఘటనపై కమిటీ బృందం తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు కారకులైన వ్యక్తులను వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు పోలీసులను కోరారని సీఆర్డీఏ కార్యాలయం గురువారం జారీ చేసిన ఒక ప్రకటలో పేర్కొంది.

సెక్యూరిటీని తీసేసి..

గత టీడీపీ ప్రభుత్వం రాజధాని నమూనా ఆర్ట్ గ్యాలరీ సంరక్షణకు పోలీస్ సెక్యూరిటీని ఏర్పాటు చేసింది. అప్పట్లో సందర్శకులు ప్రధాని శంకుస్థాపన చేసిన ప్రదేశాన్ని చూడటానికి పోటెత్తారు. పవిత్రమైన మట్టి నీరు. ఆర్ట్ గ్యాలరీ, శంకుస్థాపన శిలాఫలకాన్ని రక్షించటానికి సెక్యూరిటీని పెట్టారు. వైసీపీ వచ్చిన ఒక సంవత్సరం కాపలా ఉంది. సందర్శకులు రావటానికి రోడ్లన్నీ ఇసుక మాఫియా ధ్వంసం చేసింది. కాలక్రమంలో పోలీస్ సెక్యూరిటీని ఎత్తేశారు. భద్రత లేకపోవటంతో అసాంఘిక శక్తులు శంకుస్థాపన ప్రదేశంలో విచ్చలవిడిగా వ్యవహారాలు సాగిస్తున్నాయి. గత కొంత కాలం నుంచచి అరాచక శక్తులు శంకుస్థాపన ప్రదేశాన్ని ధ్వంసం చేసున్నా సీఆర్డీఏ పట్టించుకోక పోవటం గమనార్హం. ఘటన వెలుగులోకి వచ్చాక చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయటం విచిత్రంగా ఉందని భూములిచ్చిన రైతులు అంటున్నారు.

ఈ నెల 30, మే 6న పలు రైళ్ల రద్దు

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ బ్లాక్ కారణంగా ఈ నెల 30, మే 6వ తేదీన పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న నెంబరు. 07779 గుంటూరు మాచర్ల, 07780 మాచర్ల - గుంటూరు, 07580 మాచర్ల - నడికుడి, 07579 నడికుడి - మాచర్ల, నెంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్, 17645 సికింద్రాబాద్ - రేపల్లె రైళ్లను పూర్తిగా రద్దు చేస్తున్నామన్నారు.

మే 6వ తేదీన నెంబరు. 07791 కాచీగూడ - నడికుడి, 07792 నడికుడి - కాచీగూడ రైళ్లను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30న నెంబరు. 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నడికుడి మార్గంలో కాకుండా వరంగల్, కాజీపేట మీదగా విజయవాడకు మళ్లించడం జరుగు తుందన్నారు. మే 6వ తేదీన నెంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్ రైలు 60 నిమిషాల ఆలస్యంగా రీషెడ్యూల్ చేయడం జరుగుతుందన్నారు.

భానుడి భగభగ.. జనం విలవిల..

గుంటూరు(విద్య),ఏప్రిల్ 18: భానుడి భగభగలతో గురువారం గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రజలు అల్లాడారు. వేసవి తీవ్రత ప్రారంభమైన మొదటి వారంలోనే ఎండ తీవ్ర పెరగడం ఇదే ప్రథమం. ఉదయం 11 గంటలకే నగరంలోని అనేక ప్రాంతాల్లో వీధులు ఖాళీ అయ్యాయి. వడగాల్పులు అధికంగా వీయడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దీంతో చెట్ల నీడలను, శీతల పానీయాలను ఆశ్రయించారు. కొన్ని ప్రాంతాల్లో మరమ్మతుల పేరుతో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో అక్కడి ప్రజలు ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు వేసవి తాపానికి ఇళ్లలోనే ఉడికి పోయారు.



పరదాలతో ప్రయాణం..



ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్
- జిల్లా నేతల సమక్షంలో బాధ్యతలు స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన అనంతరం కొమ్మాలపాటి శ్రీధర్‌ను అభినందిస్తున్న పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ తదితరులు

నరసరావుపేటటౌన్, ఏప్రిల్ 18: రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనను అంతం చేయడానికే కూటమి ఏర్పడిందని, ప్రజాస్వామ్యం పరిరక్షణే కూటమి ప్రధాన ధ్యేయం అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గురువారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా కొమ్మాలపాటి శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. శ్రీధర్‌కు వేద పండితులు ఆశీర్వాదాలు అందజేశారు. అదేవిధంగా వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పెదకూరపాడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెన్నా సాంబశివారెడ్డి, నాదెండ్ల బ్రహ్మం చౌదరి, అబ్బూరి శివనాగ మల్లేశ్వరరావు, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, అట్లా చినవెంకటరెడ్డి.. కొమ్మాలపాటి శ్రీధర్‌ను ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడుగా చంద్రబాబు తనను నియమించడం తన అదృష్టం అన్నారు. పార్టీకి చేసిన సేవలకు తగిన గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. అమరావతి పునఃనిర్మాణం జరగాలంటే కూటమి గెలవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, గొట్టిపాటి జనార్ధన్‌బాబు, కరిముల్లా, సదాశివ రావు, రాపర్ల జగ్గారావు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు కుమ్మెత కోటిరెడ్డి, కూరపాటి హనుమంతురావు, దాసరి ఉదయశ్రీ, కోసూరి రాధిక, గుర్రం నాగపూర్ణచంద్రరావు, నాగ సుధీర్, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

అమరావతి శంకుస్థాపన ప్రదేశాన్ని అపవిత్రం చేశారు

- రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతే
- 1584వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఏప్రిల్ 18: సాక్షాత్తు ప్రధాని మంత్రి మోదీ వేద మంత్రోచ్ఛరణల నడుమ రాజధాని అమరావతికి శంకుస్థాపన చేసిన ఉద్దండ్రాయునిపాలెం ప్రదేశాన్ని వైసీపీ ప్రభుత్వం అపవిత్రం చేసిందని రాజధాని ప్రాంత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న నిరసన దీక్షలు, ఆందోళనలు గురువారం నాటికి 1584వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, ఏ రాష్ట్రానికి మూడు రాజధానులుండి అభివృద్ధి చెందిందో సీఎం జగన్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం అమరావతిని చంపేయటానికే మూడు ముక్కలాట పెట్టారన్నారు. రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతేనని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది.



వెంకటపాలెం శిబిరంలో మహిళలు, రైతుల ఆందోళన

83,908 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 88,176 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 83,908 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 68,946 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17500
నెంబరు. 5	9000	16200
273	11500	12200
341	8000	16500
4884	11000	15000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	19300
బ్యాడిగి	8500	16000
దేవనూరు డీలక్స్	9000	15500
తెల్లకాయలు	5000	11000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	132, 141,152
చికెన్ విత్ స్కిన్	252.00
చికెన్ స్కిన్ లెస్	262.00

అసెంబ్లీకి ఏడుగురు నామినేషన్లు దాఖలు

బాపట్ల, ఏప్రిల్ 18 : బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ఏడుగురు అభ్యర్థులు మొదటిరోజు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. బాపట్ల తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను అందజేశారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా కోన రఘుపతి, కోన రమాదేవిలు రిటర్నింగ్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌కు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అదేవిధంగా ఆల్ తెలుగు ప్రజాపార్టీ వ్యవస్థాపకులు, విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి డాక్టర్ కటికల శివభాగ్యారావు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. బహుజన సమాజ్‌వాది పార్టీ అభ్యర్థిగా గుదే రాజారావు రెండుసెట్‌ల నామినేషన్ పత్రాలను అందజేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా దేవరకొండ రాజేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థిగా దోనేపాటి షాలినిలు నామినేషన్ వేశారు. రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీధర్ మాట్లాడుతూ నామినేషన్ వేయటానికి వచ్చే అభ్యర్థితోపాటు నలుగురికి మాత్రమే లోపలకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, బి.శ్రీకాంత్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ నియోజకవర్గానికి రెండునామినేషన్లు

బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గానికి తొలిరోజు గురువారం ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి కట్టెంపూడి విజయ్‌కుమార్, నవతరం పార్టీ నుంచి నల్లమల్ల తిరుపతిరావు నామినేషన్ దాఖలు చేశారు.

బాపట్లలో 144వ సెక్షన్ అమలు


తహసీల్దార్ కార్యాలయం రోడ్డుకు అడ్డుగా పెట్టిన భారికేడ్‌లు

బాపట్ల, ఏప్రిల్ 18 : ఎన్నికల నోటిఫికేషన్ జారీకావటంతో బాపట్లలో 144వ సెక్షన్ అమలులో ఉన్నట్లు రిటర్నింగ్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభం కావటంతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే మూడురోడ్లలో 100 మీటర్ల దూరంలో బారికేడ్‌లు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ యు.శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిన్నారి వైద్యానికి అఖండ ఫౌండేషన్ ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న సురేష్, న్యాయవాది హరినాథరెడ్డి తదితరులు

బాపట్ల,ఏప్రిల్ 18 : తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి అఖండ ఫౌండేషన్ ఆర్థికసాయం అందజేసింది. చిన్నారి కల్వరి కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్, న్యాయవాది కళ్ళం హరినాథరెడ్డి, గౌరవాధ్యక్షుడు జీవీఎల్ మోహన్‌గౌడ్‌లు గురువారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. గతంలో ప్రభుత్వం మందులు ఉచితంగా అందించేదని ప్రస్తుతం ఎటువంటి సహకారం అందటంలేదని చిన్నారి తల్లిదండ్రులు తెలిపారు. ప్రస్తుతం 11 సంవత్సరాల వయస్సు కలిగిన తమ బిడ్డ కల్వరికి ఆపరేషన్ చేయించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం

కర్లపాలెం, ఏప్రిల్ 18 : రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమౌతుందని టీడీపీ గణపవరం గ్రామ అధ్యక్షుడు గూడూరు కృష్ణప్రసాద్, టీడీపీ నాయకుడు దుగ్గిరాల రంగబాబు అన్నారు. మండలంలోని గణపవరంలో ఎమ్మెల్యే అభ్యర్థి నరేంద్రవర్మ, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని గురువారం ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల రంగబాబు, కాక ఆంజనేయులు, గూడూరు బోస్‌బాబు, జనసేననాయకులు గొట్టిపాటి శ్రీకృష్ణ, గరికపాటి శ్రీకృష్ణ, బెల్లకొండ శివబాబు, వెంకయ్యనాయుడు, తోట గంగరాజు, అక్కల వల్లారెడ్డి, వీర్లంకరెడ్డి, మాచవరపు రాయుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

25 మంది వలంటీర్లు రాజీనామా

అమృతలూరు, ఏప్రిల్ 18 : అమృతలూరు 1, 2 సచివాలయల పరిధిలో వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. రెండు సచివాలయాల పరిధిలో 34 మందికి గాను 25 మంది వలంటీర్లు రాజీనామా చేయగా అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు గాను మరో ఇద్దరు వలంటీర్లను సస్పెండ్ చేశారు.

ఉప్పూడి ఎంపీటీసీ సతీష్‌బాబు రాజీనామా

రేపల్లె, ఏప్రిల్ 18 : వైసీపీకి చెందిన ఉప్పూడి ఎంపీటీసీ అల్లంశెట్టి సతీష్‌బాబు తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న రోజుల్లో జనసేన పార్టీలో చేరనున్నట్లు తెలిపారు.

కోళ్ల దొంగతనం కేసులో వ్యక్తి అరెస్టు

కర్లపాలెం, ఏప్రిల్ 18 : కోళ్ళ దొంగతనం కేసులో పెదపులుగువారిపాలేనికి చెందిన శవనం శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచామని కర్లపాలెం ఎస్ఐ జనార్థన్ తెలిపారు. ఇతను భట్టిప్రోలు బైక్‌ల దొంగతనం కేసులో కూడా నిందితుడిగా ఉన్నారని ఎస్సై వివరించారు. కాగా మండలంలోని యాజలిలో గ్రామం టెంట్ హౌస్ సమీపంలో రాంబాబు ఇంటి వద్ద బుధవారం రాత్రి కట్టేసిన గొర్రెపోతును దుండగులు అపహరించుకొని పోయారు.

శ్రీరామనవమి పందిళ్ళల్లో అన్న సమారాధనలు

భట్టిప్రోలు, ఏప్రిల్ 18 : శ్రీరామనవమి పర్వదినంను పురస్కరించుకుని మండలంలోని శ్రీరామనవమి పందిళ్ళల్లో అన్న సమారాధనలు జరిగాయి. మండలంలోని ఐలవరం గ్రామంలో తాడిపర్తివారివీధిలో కూరపాటి రఘురామయ్య ఆధ్వర్యంలో శ్రీసత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించి అన్న సమారాధన నిర్వహించారు. భట్టిప్రోలు గ్రామంలో కుమ్మరగుంటవారివీధి, భోగేశ్వరపేట, విఠలేశ్వరనగర్, బట్టువారి రామమందిరం, కొత్తపేట, అద్దేపల్లి కాలువకట్ట, వెల్లటూరు, పెదపులివర్రు, ఓలేరు గ్రామాల్లో గల రామమందిరం, ఆయా గ్రామాల్లోని రామ మందిరాలు, చలువ పందిళ్ళల్లో, ప్రాంగణాల్లో అన్న సమారాధనలు జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

చెరుకుపల్లి, ఏప్రిల్ 18: గ్రామాల్లోని రామమందిరాల్లో గురు వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ప్రత్యేక పూజల అనంత రం చెరుకుపల్లి, గుళ్ళపల్లి, కొత్తపేట, తూర్పుపాలెం, గ్రామాల్లో వేలాదిమందికి అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, పూషడపు కుమారస్వామి, ఎంఆర్‌కే మూర్తి, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కోన పూజలు

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 18 : శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బాపట్ల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి వారి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కోన రఘుపతి తన నామినేషన్ పత్రాలను స్వామివారి పాదాల చెంత ఉంచి పూజలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి వైసీపీనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో సినీస్టూడియో ఏర్పాటు చేస్తా : కోన

బాపట్ల, ఏప్రిల్ 18 : రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వారితో చర్చించి బాపట్లలో సినీస్టూడియో ఏర్పాటు చేస్తానని ప్రముఖ సినీనిర్మాత కోన వెంకట్ తెలిపారు. స్థానిక కోన ఛాంబర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రేక్షకులు ఇచ్చిన గుర్తింపు, పుట్టిన నేలను మరిచిపోకుండా హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్న బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో సినీ పరిశ్రమ ఏర్పాటు చేస్తానన్నారు. కోన ప్రభాకరరావు సినీ స్టూడియో పెట్టి తీరుతానన్నారు.

సినీరంగంలో రాజకీయాలు ఉండవు

సినిమా టిక్కెట్ ధరల విషయంపై గతంలో తాను అప్పటి మంత్రి పేర్నినానితో మాట్లాడినట్లు ప్రముఖ సినీనిర్మాత కోన వెంకట్ తెలిపారు. బాపట్ల పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక వస్తువును తయారు చేసే వ్యక్తికి దాని ధర నిర్ణయించే అధికారం ఉంటుందన్నారు. అదేవిధంగా సినిమా తీస్తే దానికి అయ్యే పెట్టుబడిని బట్టి టికెట్ ధరలు కూడా నిర్మాతకు అవకాశం ఇవ్వాలన్నారు. సినీరంగంలో రాజకీయాలు ఉండవన్నారు. సినిమా టిక్కెట్ల విషయంలో ధరల నిర్ణయం ప్రభుత్వానికి ఎందుకు అని ఆయన ప్రశ్నించారు. సినిమా నిర్మాణానికి అయిన ఖర్చు నిర్మాతలకే తెలుస్తుందన్నారు.

గీతాంజలి మళ్లీ వచ్చింది సినిమా హిట్ అవ్వడం చాలా సంతోషం

గీతాంజలి మళ్లీ వచ్చింది అనే సినిమా హిట్ అవ్వడం తనకు ఎంతో సంతోషం అని ఆ చిత్ర సమర్పకులు, ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ తెలిపారు. గురువారం బాపట్లలోని శారా ఫెయిత్ ఫౌండేషన్ చిల్డ్రన్ హోమ్‌లో ఆయన చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన వెంట చిల్డ్రన్ హోమ్ నిర్వాహకులు జాషువా,బెనర్జీ, కాగిత రాకేష్, జోగి, బుచ్చిబాబు ఉన్నారు.

జగన్ పాలనలో అన్ని విధ్వంసాలే

- రాష్ట్రాన్ని గాడిలో పెట్టే సమర్థుడు చంద్రబాబు
- విజ్ఞతతో ఓటు వేయాలంటూ ఆనందబాబు అభ్యర్థన
- లంక గ్రామాల్లో ప్రచారానికి విశేష స్పందన


లంక గ్రామాల్లో ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తున్న ఆనందబాబు

కొల్లూరు, ఏప్రిల్ 18 : ఈ ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో అన్ని విధ్వంసాలేనని టీడీపీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు విమర్శించారు. గురువారం కొల్లూరు మండలం జువ్వలపాలెం, తడికలపూడి, కిష్కిందపాలెం, తిప్పలకట్ట, తోకలవానిపాలెం, పోతార్లంక గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లంక గ్రామాల్లో ఆనందబాబుకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కిష్కిందపాలెంలో మహిళలు గుమ్మడికాయతో దిష్టి తీసి హారతులతో స్వాగతం పలికారు. ప్రచారంలో ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ నమ్మి ప్రజలు అధికారం ఇస్తే వారిని దారుణంగా మోసం చేశారన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేయడంతో పాటు రాజధానిని, పోలవరం ప్రాజెక్టును ధ్వంసం చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. తిరోగమనంలో ఉన్న ఆంధ్రాను మళ్లీ పురోగతికి తీసుకు వచ్చే సత్తా గల నాయకుడు చంద్రబాబేనన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచన చేసి టీడీపీ కూటమి అభ్యర్థులైన తనను, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో భాగంగా ఆలయాలు, చర్చీలను సందర్శించి పూజారులు, పాస్టర్ల నుంచి ఆశీర్వాదాలు పొందారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, సుంకర రాంబాబు, గుమ్మడి శివ, సుంకర శ్రీను, కంచర్ల కోటేశ్వరరావు, వేములపల్లి మోహనకృష్ణ, బోయపాటి తేజ, సుంకర రాంప్రసాద్, కొల్లి గోపి, రావుల రమేష్, మద్దుల శ్యామ్, జనసేన నాయకులు బొందలపాటి చలమయ్య, సమ్మెట దుర్గాప్రసాద్, లంక గ్రామాల ఆయా పార్టీల కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిన కార్యకర్తలు

వైసీపీకి చెందిన పది కుటుంబాలు ఆ పార్టీని వీడి ఆనందబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం మండలపరిధిలోని తడికలపూడిలో ఆనందబాబు ప్రచారం నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరులు టీడీపీలో చేరారు. వారికి ఆనందబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

మొక్కజొన్న కూలీల ఉత్సాహం

జువ్వలపాలెంలో ప్రచారానికి వచ్చిన ఆనందబాబు తొలుత అక్కడ ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు వచ్చిన వాహనాల్లో డీజే వాయిద్యాలు, పాటలకు సమీప మొక్కజొన్న పొలాల్లో పని చేస్తున్న మహిళా కూలీలలో ఉత్సాహం పెరిగి స్టెప్పులు వేశారు. ఇది గమనించిన ఆనందబాబు వెంటనే వారి వద్దకు వెళ్లి వారి క్షేమసమాచారం తెలుసుకోవడంతో పాటు తనకు, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు.


మొక్కజొన్న పొలాల్లో పని చేస్తున్న కూలీలను ఓట్లు అభ్యర్థిస్తున్న ఆనందబాబు

మాజీ సర్పంచ్ బుజ్జికి పరామర్శ

జువ్వలపాలెంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఆనందబాబుకు ఆ గ్రామపార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ యార్లగడ్డ శ్రీనివాసరావు (బుజ్జి) అనారోగ్యానికి గురయ్యాడని సమాచారం తెలుసుకున్న ఆయన మాజీ సర్పంచ్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి

- టీడీపీకి అండగా నిలవండి
- రేపల్లెను మరింత అభివృద్ధి చేసి చూపెడతా
- ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, ఏప్రిల్ 18: డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలంతా టీడీపీకి అండగా నిలవాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. గురువారం రేపల్లె మండలం వడ్డివారిపాలెం, బొందలగరువు, కైతేపల్లి పంచాయతీల్లో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తీరప్రాంతాన్ని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని మీ గ్రామాల్లో వేసిన సీసీ రోడ్లు టీడీపీ హయాంలోనే అన్నారు. వైసీపీ అధికారంలోకి నాటి నుంచి ఎక్కడా కూడా ఒక్క రోడ్డు వేసిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వానికే ప్రజలు అండగా


వడ్డివారిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్


ఎమ్మెల్యే అనగానికి పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

నిలవాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ళలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, యువతకు ఉద్యోగ కల్పన చెయ్యటంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పింఛన్ రూ.4వేలు అందించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ టీడీపీకి అండగా నిలిచి తమ విజయానికి కృషి చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రేపల్లె రామాంజనేయులు, రేపల్లె సురేష్, కమతం శివ, వడ్డి లక్ష్మోజీ, రేపల్లె పాపారావు,బర్మా వీరరాఘవయ్య, కైతేపల్లి సుబ్బయ్య, బ్రాహ్మణేశ్వరరావు, వర్రే మహేంద్ర, జనసేన నాయకులు రేపల్లె జానకిరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

నగరం మండలం కొలగానివారిపాలెంలో శ్రీరామనవమి పందిళ్లలో సీతారాముల వారికి గురువారం ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేపల్లె మండలం వేజళ్ళవారిలంకలో శ్రీరామనవమి సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

బాపట్ల, ఏప్రిల్ 18 : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆర్టీసి గ్యారేజి, ఇండియన్ గ్యాస్ గోదాం, కోన ఫిల్లింగ్‌స్టేషన్, రిలయన్స్ ఆయిల్‌బంక్ తదితర ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అగ్నిప్రమాదాలు సంభవించటం, వాటిని ఎదుర్కోవటం, నివారణ చర్యలు చేపట్టటం గురించి ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్యాలయాల సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్టీసీ గ్యారేజిలో కార్మికులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

మంటలు రాజేసిన స్వల్ప వివాదం

● గ్రామంలో రెండు చోట్ల పికెట్ ఏర్పాటు

చుండూరు ఏప్రిల్ 18 : ఓ 80 సంవత్సరాల వృద్ధురాలు తన ఇంటి ముందు పడవేసిన పాచిని ఊడ్చుకుంటూ అన్నమాటలు ఆ గ్రామంలో ఇరువర్గాల మధ్య మంటలు రాజేశాయి. ఇదే అదునుగా భావించిన ఆ గ్రామానికి సంబంధం లేని వ్యక్తులు వివాదంలో తలదూర్చి ఆర్థికంగా, రాజకీయంగా లబ్ధిపొందటానికి కుటిల యత్నాలు చేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... మండలంలో మండూరు గ్రామంలో రెండు రోజుల క్రితం ఓ 80 సంవత్సరాల వృద్ధురాలు అన్న మాటలతో రాజకీయ రంగుపులుముకుంది. దీంతో బుధవారం రాత్రి గ్రామంలో ఒక వర్గం వారు రోడ్లపైకి వచ్చి వాహనాలు, రాళ్ళు అడ్డంపెట్టి రాకపోకలకు అంతరాయం కల్పించి కర్రలు పట్టుకుని హల్‌చల్ చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ మురళీకృష్ణ చుండూరు, అమర్తలూరు పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో చుండూరు సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామానికి వచ్చిన పోలీసులు ఇరువర్గాలను సమావేశపరిచి తెల్లవారుజామున 3గంటల వరకు చర్చలు జరిపారు. ఒక వర్గం కోరినట్లు ఆ వృద్ధురాలితో క్షమాపణ చెప్పించారు. దీంతో సమస్య పరిష్కారమైందని, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ రైతు దేవిరెడ్డి ప్రసాద్‌కు చెందిన 22 ఎకరాల్లోని గడ్డివాములకు నిప్పుపెట్టగా అవి పూర్తిగా దగ్ధమయ్యాయి. తిరిగి గ్రామంలో ఉద్రిక్తతలు చోటు చేసుకుంటాయని గ్రహించిన డీఎస్పీ మురళీకృష్ణ గ్రామంలో బీఎస్ఎఫ్ దళాలతో రెండు చోట్ల పికెట్లు ఏర్పాటు చేశారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో డీఎస్పీ ప్రత్యేక చొరవ తీసుకుని ఇరువర్గాలను చుండూరు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి రాత్రి వరకు చర్చలు జరిపారు. కాగా ఒక వర్గం వారు గడ్డివాముల దగ్ధం విషయంలో కేసు నమోదు చేయాలని కోరగా పరిశీలిస్తామని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ గ్రామానికి చెందిన అత్యధిక మంది గత నెలలో వైసీపీని వీడి జనసేన, టీడీపీలో చేరారు. దీన్ని జీర్ణించుకోలేని అధికార పార్టీ నాయకుడు తన రాజకీయ లబ్ధి కోసం గ్రామంలో వర్గాలను రెచ్చగొట్టి రాజకీయ చలిమంట రాజేశాడని, అన్నదమ్ముల్లాగా మెలిగే గ్రామంలో బయట వ్యక్తులను ప్రవేశపెట్టి ఇలాంటి దుశ్చర్యకు పాల్పడుతున్నాడని గ్రామస్థులు ఆరోపించారు. ఇలాంటి చర్యలను అధికారులు సమర్థవంతంగా అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు విలువైనది

వేమూరు, ఏప్రిల్ 18 : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో విలువైనది అని నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటు హక్కుపై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు గురువారం సాయంత్రం మండలంలోని జంపని గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో శేషగిరిరావు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్నికల అధికారి వసంతరాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పవిత్రమైన ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించే విధంగా ఉద్యోగులు ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమం లో తహసీల్దార్ కిరణ్, పంచాయతీ కార్యదర్శి వివేకానంద, 17 గ్రామాల పరిధిలోని పంచాయతీ కార్యాలయాల సిబ్బంది సచివాలయాల సిబ్బంది, వివిధ శాఖల అధికారులు యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన బాచిన

బాపట్ల, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, ఆయన కుమారుడు కృష్ణ చైతన్యలు గురువారం హైదరాబాద్‌లో కలిశారు. అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా ఇటీవల వరకు పని చేసిన కృష్ణచైతన్య ఇటీవలే టీడీపీ తీర్థం పుచ్చుకున్న సంగతి తెలిసిందే. గురువారం వారి అనుచరులతో కలిసి లోకేశ్‌ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ అధికారంలోకి రాగానే సముచిత ప్రాధాన్యం దక్కుతుందని లోకేశ్ వారికి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎవరికీ అన్యాయం జరగదని, పార్టీ గెలుపుకోసం సమష్టిగా పనిచేయాలని న్యాయం చేసే బాధ్యత తాను తీసుకుంటానని లోకేశ్ స్పష్టం చేసినట్లు సమాచారం.

5న మెగా లోక్‌అదాలత్

రేపల్లె, ఏప్రిల్ 18 : జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను మే 5వ తేది నిర్వహిస్తామని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం స్థానిక కోర్టు ప్రాంగణంలో సర్కిల్‌లోని పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 5వ తేదీన జరిగే లోక్‌అదాలత్‌లో పెండింగ్ కేసులను పరిష్కారం చేసుకునే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎల్ జగదీష్‌కుమార్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పట్టణ ప్రజలకు సమృద్ధిగా సాగునీరు

రేపల్లె, ఏప్రిల్ 18: పట్టణంలోని ప్రజలకు సమృద్ధిగా సాగునీరు అందించేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో మెయిన్ కెనాల్ నుంచి ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్తా తెలిపారు. వేసవికాలంలో కొన్ని వార్డుల్లో తాగునీరు కొరత ఉందని ఆ సమస్యను పరిష్కరించేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీటిని నింపి ప్రజలకు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. మెయిన్ కెనాల్‌లో నీరు విడుదల చెయ్యటంతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నింపుతున్నట్లు తెలిపారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

రేపల్లె, ఏప్రిల్ 18: నిజాంపట్నం మండలం కొత్తపాలెం పంచాయతీకి చెందిన వైసీపీ నాయకుడైన కొపనాతి కృష్ణారావు, మోకా సాయిబాబు, నగరం మండలం చిరకాలవారిపాలెంకు చెందిన వైసీపీ నాయకురాలు చిరకాల శివనాగమల్లేశ్వరికి ఎమ్మెల్యే సత్యప్రసాద్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, కె.వెంకటేశ్వరరావు, దండుప్రోలు వెంకటేశ్వరరావు, చింతల సుబ్బారావు, వి.వీరయ్య, గుడారంకయ్య, పి.చింతారావు పాల్గొన్నారు.


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

వైసీపీ నుంచి టీడీపీలోకి పది కుటుంబాలు చేరిక

భట్టిప్రోలు, ఏప్రిల్ 18 : వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. భట్టిప్రోలుకు చెందిన 10 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సమక్షంలో గుంటూరు క్యాంపు కార్యాలయంలో గురువారం టీడీపీలోకి చేరగా ఆనందబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి అభ్యర్థుల గెలుపుకోసం పార్టీలో చేరిన కృషి చేయాలని పార్టీ కోసం పని చేసిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఆనందబాబు స్పష్టం చేశారు. నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బట్టు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఉక్కడాల ఆనంద్, కొలుసు శివన్నారాయణ, తాడిపర్తి సత్యనారాయణ, కొనకాల ప్రసాద్, టంటం శ్రీనివాసరావు, ఎం. వెంకటేష్, మేస్త్రి శ్రీనివాసరావు తదితరులు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వంగర వీరయ్య, కర్ణ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఆనందబాబు

వేమూరు, ఏప్రిల్ 18 : మండలంలోని జంపని సగరపాలెం రామాలయంలో గురువారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి ఆయన గోత్రనామాలతో పూజలు జరిపించి అనంతరం సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్‌ప్రసాద్, టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తొలి రోజున నామినేషన్లు నిల్

వేమూరు, ఏప్రిల్ 18 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం నుండి నోటిఫికేషన్ ఆధారంగా నామినేషన్ల పర్వం ప్రారంభించారు. అయితే వేమూరు నియోజకవర్గం నుండి మొదటి రోజున ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎన్నికల అధికారి వసంతరాయుడు తెలిపారు.

టీడీపీతోనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి


● డాక్టర్ నక్కా అఖిలేశ్

వేమూరు, ఏప్రిల్ 18 : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కి తోడ్పడేది తెలుగుదేశం ప్రభుత్వమేనని డాక్టర్ నక్కా అఖిలేశ్ తెలిపారు. వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన కుమారుడు అఖిలేశ్ గురువారం జంపని గ్రామంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ నివాసిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి వృద్ధులను, మహిళలను పలకరించారు. రామాలయం తిరుపతమ్మ దేవాలయాల్లో పూజలు జరిపించారు. రానున్న ఎన్నికల్లో ప్రజావ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తున్న జగన్ పాలనకు బుద్ధి చెప్పాలని కోరారు. కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని తద్వారా రాష్ట్రంలో సుపరిపాలనతో పాటు అభివృద్ధి సంక్షేమం ముందు కు నడుస్తాయని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


జంపనిలో అఖిలేశ్‌కు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే టీడీపీని గెలిపించుకోవాలి

చెరుకుపల్లి, ఏప్రిల్ 18: రాష్ట్ర ప్రజలకు సుభిక్ష పాలన కావాలంటే ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ కు విజయం చేకూర్చాలని రేపల్లె నియోజకవర్గ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి అన్నారు. గురువారం మండలంలోని తూర్పుపాలెం, గుళ్ళపల్లి పంచాయతీలో జరుగుతున్న శంఖారావం కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొని ఇంటింటా కరపత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ రైతుకు సాగు, తాగునీరు టీడీపీ ప్రభుత్వంలో సక్రమంగా అందించామని ఆయన తెలిపారు. జగన్ పాలనలో సామాన్యుడిపై దాడులు జరుగుతున్నాయని, ఆడాడులను అరికట్టాలంటే ఎన్డీయే కూటమితోనే సాధ్యమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మొఖమాటం రాధాకృష్ణమూర్తి, ఉయ్యూరు శివ, మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు మల్లాది రామకృష్ణ, టీడీపీ నాయకులు దివి రాంబాబు, పొదిలి వెంకటేశ్వరరావు, అక్కల రామసుబ్బారెడ్డి, నాగుల నరేంద్ర, మత్తి వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు మత్తి భాస్కరరావు, టీడీపీ నాయకులు కందుల చంద్రమౌళి, పూషడపు కృష్ణప్రసాద్, ఏనుగుల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


తూర్పుపాలెంలో శంఖారావం కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

సాయిబాబా మందిరాన్ని కూల్చటం హేయం

రేపల్లె, ఏప్రిల్ 18: పాతపట్నంలోని రహదారి విస్తరణలో భాగంగా ఎలాంటి అడ్డం లేకుండా ఉన్న సాయిబాబా మందిరాన్ని అధికార పార్టీ నాయకుడు కూల్చటం హేయమని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రాసంశెట్టి మహేష్ అన్నారు. గురువారం పాతపట్నంలో కూల్చిన సాయిబాబా గుడి వద్ద నిరసన, ధర్నా నిర్వహించారు. రోడ్డు విస్తరణ పేరు అడ్డం పెట్టుకుని మందిరాన్ని కూల్చటం సరైన పద్ధతి కాదన్నారు. ఎమ్మెల్యే అనగాని అధికారాన్ని చేపట్టిన వెంటనే ఆ ఆలయాన్ని పునర్నిర్మిస్తారని తెలిపారు. కార్యక్రమంలో శంకర్, మలిశెట్టి సాయి, కె.జగదీష్, యూ సురేష్, పి.పవన్‌కల్యాణ్, టీడీపీ నాయకులు దేవగిరి రంగ, రాజు, బీజేపీ నాయకులు అన్నం సాయి వరప్రసాద్, డి.వెంకటేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.


లోకేశ్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న అమరావతి రాజధాని మహిళలు


లోకేశ్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు

సీన్ రిపీట్..


- పొన్నూరులో నరేంద్రపై ఎప్పుడూ కొత్త ప్రత్యర్థులే...
- ఆరు ఎన్నికల్లో ఐదుగురిపై గెలుపు
- ఏడోసారి తెరపైకి మరో అభ్యర్థి



గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పొన్నూ రు అసెంబ్లీ నియోజక వర్గంలో తెలుగు దేశం పార్టీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రతీ ఎన్నికలోనూ కొత్త అభ్యర్థితో తలపడుతూ వస్తున్నారు. ఆయనపై ప్రత్యర్థులను బరిలోకి దింపిన కాంగ్రెస్, వైసీపీలు అదే ఆనవాయితీని కొనసాగిస్తున్నాయి. ఈ దఫా కూడా సీన్ రిపీట్ అవుతోంది. తండ్రి మరణంతో వారసత్వంగా ధూళిపాళ్ల నరేంద్రకుమార్ 1994లో పొన్నూరు నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1983 నుంచి ఇప్పటివరకు టీడీపీ ఆవిర్భవించిన తరువాత జరిగిన 9 ఎన్నికల్లోనూ పొన్నూరులో ధూళిపాళ్ల కుటుంబమే పోటీ చేస్తూ వచ్చింది. నరేంద్రకుమార్ తండ్రి వీరయ్య చౌదరి 1983, 1985, 1989లో ఇక్కడి నుంచి పోటీ చేశారు. 1989లో ఓడిపోగా 1983, 1985లో గెలుపొందారు. 1988-89లో ఏడాది పాటు రాష్ట్ర రెవెన్యూ మంత్రిగా పని చేశారు. 1989 ఎన్నికల్లో రెవెన్యూ మంత్రిగానే ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థి చిట్టినేని వెంకటరావుపై ఓడిపోయారు.

ఆరుసార్లు మారిన నరేంద్ర ప్రత్యర్థులు..

ధూళిపాళ్ల నరేంద్రకుమార్ 1994 నుంచి 2019వరకు జరిగిన ఎన్నికల్లో ఆయన ఐదుసార్లు గెలుపొందగా ఒకసారి ఓటమి పాలయ్యారు. నరేంద్రపై ఆరుసార్లు ప్రత్యర్థులు మారారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో అంబటి మురళీకృష్ణకు వైసీపీ టిక్కెట్ ఖరారు చేసింది. దీంతో నరేంద్రపై ఏడోసారి కొత్త అభ్యర్థి పోటీ పడబోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనపై పోటీ ఎప్పుడూ కొత్త అభ్యర్థే అనే ఆనవాయితీ కొనసాగుతోంది.



నరేంద్రకుమార్ తండ్రి వీరయ్య చౌదరి మరణంతో 1994 అసెంబ్లీ ఎన్నికల ముందు రాజకీయాల్లో చేరారు. తండ్రి నిర్వహించిన సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే పదవులను తనయుడు నరేంద్రకుమార్ కైవసం చేసుకున్నారు. 2009లో పొన్నూరు నియోజకవర్గం పునర్విభజనతో రూపురేఖలు మారాయి. ప్రస్తుతం పెదకాకాని, పొన్నూరు, చేబ్రోలు మండలాలు, పొన్నూరు పురపాలక సంఘం ఈ నియోజకవర్గ పరిధిలో ఉంది.

ఆనవాయితీ ప్రకారం మారిన అభ్యర్థి...

పొన్నూరులో నరేంద్రపై ప్రత్యర్థి మారడం ఆనవాయితీగా వస్తుంది. దానిలో భాగంగా ప్రత్యర్థి కిలారి రోశయ్య తిరిగి పోటీ చేయాలని భావించారు. అయితే ఆయన్ని వైసీపీ అధిష్టానం గుంటూరు ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేసింది. దీంతో అంబటి రాంబాబు సోదరుడు మురళీకృష్ణని ఈ సారి కొత్త అభ్యర్థిగా వైసీపీ ఎంపిక చేసింది.

నరేంద్రపై పోటీ చేసిన వారి వివరాలు..

1994 - తలశిల వెంకటరామయ్య చౌదరి
1999 - చిట్టినేని ప్రతాప్
2004 - మన్నవ రాజకిషోర్
2009 - మారుపూడి లీలాధరరావు
2014 - రావి వెంకట రమణ
2019 - కిలారి రోశయ్య

- ఎన్నికల వేళ జోరుగా జెండాల మార్పు
- నేతలను వెంటాడుతున్న కోవర్ట్‌ల భయం
- పార్టీ జెండా ఒకటి... పనిచేసేది మరొకరికి
- రాజకీయ వ్యూహాల విషయంలో జాగ్రత్తపడుతున్న నాయకులు

అపూర్వ ఘట్టం

- కోలాహలంగా నారా లోకేశ్ నామినేషన్
- భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు
- అడుగడుగునా ప్రజల నుంచి అపూర్వ స్పందన
- సర్వమత ప్రార్థనలతో ర్యాలీని ప్రారంభించిన నేతలు
- లోకేశ్ తరపున నామినేషన్ దాఖలు చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతలు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 18: మంగళగిరిలో నారా లోకేశ్ నామినేషన్ ఘట్టం జన జాతరను తలపించింది. నామినేషన్ కార్యక్రమానికి లోకేశ్ హాజరు కాకపోయినప్పటికీ... ఆయన తరపున ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతలు నామినేషన్ దాఖలు చేశారు. ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు అసంఖ్యాకంగా తరలిరావడంతో గురువారం మంగళగిరి పట్టణంలో తిరునాళ్ల వాతావరణం నెలకొంది. తొలుత గురువారం ఉదయం పది గంటలకు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాతమంగళగిరి సీతారామస్వామి కోవెలలో నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితుల ఆశీర్వచనాలు పొందారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతల ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతపెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మాట్లాడుతూ మంగళగిరి చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో లక్ష ఓట్ల మెజార్టీతో లోకేశ్ గెలవబోతున్నారని చెప్పారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నారా లోకేశ్ నామినేషన్ ఘట్టం మంగళగిరి చరిత్రలో ఓ సువర్ణాధ్యాయమన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పంచుమర్తి ప్రసాద్ మాట్లాడుతూ మంగళగిరి సమగ్రాభివృద్ధి సాధించాలంటే రాబోయే ఎన్నికల్లో నారా లోకేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం పాతమంగళగిరి సీతారామస్వామి కోవెల వద్ద నుంచి నిర్వహించిన భారీర్యాలీ జైత్రయాత్రలా సాగింది. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో పురవీధులు హోరెత్తాయి. పాత కూరగాయల మార్కెట్, మిద్దె సెంటరు, వైష్ణవి కల్యాణ మండపం, పాతబస్టాండు మీదుగా ర్యాలీ కొనసాగింది. ర్యాలీకి మద్దతుగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్, పలు దళిత సంఘాల నేతలు లోకేశ్‌కు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం మధ్యాహ్నం 2:34 గంటలకు కూటమికి చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు లోకేశ్ తరపున రెండుసెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను మంగళగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి గణియాకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, మండల అధ్యక్షుడు తోట పార్థసారధి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, ఉపాధ్యక్షులు రేఖా సుధాకర్‌గౌడ్, కాండ్రు శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొప్పలపూడి జ్యోతిబసు, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహమ్మద్ ఇబ్రహీం, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఏపీ పంచాయతీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, ఎన్డీఏ కూటమి నేతలు వేమూరి మైనర్‌బాబు, తమ్మిశెట్టి జానకీదేవి, షేక్ రియాజ్, జగ్గారపు శ్రీనివాసరావు, ఇట్టా పెంచలయ్య, ఆరుద్ర భూలక్ష్మీ, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, బేతపూడి విజయ్‌శేఖర్, సంకా బాలాజీగుప్తా, గోవాడ దుర్గారావు, రంగిశెట్టి బాబీ, విన్నకోట శ్రీనివాసరావు, మన్నెం రమేష్‌బాబు, కొత్తపల్లి శ్రీనివాసరావు, నైనాల లావణ్య, చాగంటిపాటి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


లోకేశ్ నామినేషన్ పత్రాలతో పాతమంగళగిరి సీతారామస్వామి కోవెలలో పూజలు నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు


మంగళగిరిలో లోకేశ్ తరపున రెండో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వో రాజకుమారికి అందజేస్తున్న ఎన్డీఏ కూటమి నేతలు


లోకేశ్ నామినేషన్‌కు ముందు ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం మైనార్టీలు


లోకేశ్ నామినేషన్‌కు ముందు ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్లు

పట్టర పట్టు... కోవర్టు!



బాపట్ల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ నేతలకు సరికొత్త చిక్కు వచ్చిపడింది. నిన్నమొన్నటి వరకు ప్రత్యర్థి పార్టీలో ఉన్న నేతలు ఇప్పుడు సొంతవారయ్యారు.. ఇలా జోరుగా గోడ దూకుడుల పర్వం కొనసాగుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా నేతలకు ఇప్పుడు కోవర్టుల భయం పట్టుకుంది. స్వపక్షంలోనే ఉండి పనిచేసే కన్నా ప్రత్యర్థి వర్గంలోకి చేరి వారి ఆనుపానులను చేరవేయడం ఓ రాజకీయం. స్వపక్షంలోనే కొనసాగుతూ వారి వ్యూహాలను ప్రత్యర్థి పార్టీకి చేరవేయడం మరో కోవర్టు కళ. రాజకీయ పార్టీల గెలుపు ఎత్తుల్లో ఇది కూడా ఓ వ్యూహమే. పార్టీలోకి వచ్చేవారిని కాదనలేము.. అలా అని అందరినీ కోవర్టులుగా చూడలేం... కానీ ఒకరిద్దరు మాత్రం ఈ తరహా వ్యక్తులు కచ్చితంగా ఉంటారని నేతలే నమ్ముతున్నారు. ఇప్పుడు వచ్చిన చిక్కల్లా ఆ కోవర్టులను ఎలా పసిగట్టడం అనేది మాత్రమే... ముల్లుకు ముల్లు విరుగుడే అన్న చందాన ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ప్రత్యర్థుల శిబిరాల్లో కోవర్టులను ఇప్పటికే మోహరించాయి. వీరి ద్వారానే తమ దగ్గర ఉన్న కోవర్టుల పేర్లు తెలుసుకునే సరికి అవాక్కవడం వారి వంతవుతోంది. ఫలానా వ్యక్తి కోవర్టు అని తెలిసినా బహిరంగంగా అది వెలిబుచ్చలేని వింత పరిస్థితి నేతలది. ఎందుకంటే ఇది ఎన్నికల వేళ కనుక.. ప్రతి ఓటు, ప్రతి నేత విలువైన వారే కావడంతో వారిని పార్టీలోనే ఉంచుతూ వారి విషయంలో జాగ్రత్త వహిస్తూ ఎన్నికల కార్యం జరిపించుకోవడమే ప్రస్తుతం నేతల ముందు ఉన్న తక్షణ కర్తవ్యంగా భావిస్తున్నారు.

నేతల్లో టెన్షన్..

రాజకీయం అంటేనే ఎదుటివారి బలాలు, బలహీనతలు తెలుసుకుని వాటికి అనుగుణంగా వైరి వర్గాలు గెలుపు వ్యూహాలు రచిస్తూ ఉంటాయి. కానీ నిన్న మొన్నటి వరకు తమ వెంట తిరిగిన వారు ఇప్పుడు ఆవల పక్షాన కనబడుతుండే సరికి వారిలో టెన్షన్ కనబడుతోంది. ఎందుకుంటే వారి లోగుట్టులన్నీ సదరు నేతలకు తెలిసి ఉండడమే అందుకు కారణం. తన అంతరంగికులుగా మెలిగే ఒకరిద్దరి నేతల వద్ద మాత్రమే ఎన్నికల వ్యూహాలకు సంబంధించిన వివరాలు పంచుకుంటున్నారు. గోడలకు చెవులు ఉండొచ్చు అనే చందాన అత్యంత రహస్యంగా ఎన్నికల ప్రణాళికలకు పదును పెడుతూ కోవర్ట్ రాజకీయాలకు చెక్ పెట్టాలనే తలంపుతో నేతలు ఉన్నారు.

కోవర్ట్‌లు పలు రకాలు....

ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు వివిధ రకాలుగా కోవర్ట్ ఆపరేషన్ చేపడుతుంటాయి. వాటిలో ముఖ్యంగా ప్రత్యర్థి శిబిరంలోనే ఉంచి దెబ్బతీయడం. ఇటీవల ఓ అభ్యర్థి వద్దకు ద్వితీయశ్రేణి నేత ఒకరు తాను ప్రస్తుతం ఉన్న పార్టీ వదిలేసి మీ గూటికి వస్తానని వర్తమానం పంపారు. సదరు అభ్యర్థి మాత్రం పార్టీ మారేకంటే అక్కడే ఉండి వారి పథక రచనలన్నీ తనకు చేరవేయాలని ఇదే తనకు చేసే మేలు అని చెప్పారు. అంతే అటు పార్టీ మారినట్లయింది.. ఇటు కోవర్ట్ ఆపరేషన్ మొదలయింది. ఇక రెండోది ఆవల శిబిరంలోకి వెళ్లి వారి నేతలు, కార్యకర్తలతో మమేకం అయిపోయి వారి వ్యవహారాలన్నీ గుట్టుచప్పుడు కాకుండా తన సొంత శిబిరం నేతలకు చేర్చడం. ఇదో రకం కోవర్టు వ్యవహారం. ఇక మూడో రకం కోవర్టులు కూడా ఉన్నారండోయ్.. వీరు తటస్థంగా ఉన్నట్లు కలరింగ్ ఇస్తూ ఏదో ఒక పక్షానికి లోపాయికారిగా పనిచేయడం. పోలీసులు నేరుగా డబ్బు ఉన్న చోటుకు వెళ్లే దాడులు కొన్ని సందర్భాల్లో నిర్వహిస్తుంటారు. ఇదంతా ఈ తటస్థ కోవర్టుల పుణ్యమే. ఇలా కోవర్టులందు రకాలు వేరయా అన్న చందాన వీరితో పెను ప్రమాదం కూడా అభ్యర్థులకు పొంచి ఉందండోయ్.

భలే అవకాశవాదం..

కోవర్ట్‌లకు మరో అవకాశం కూడా ఉంది. ప్రత్యర్థి పార్టీ ప్రయోజనాల కోసం పనిచేసినా ఇవతల పార్టీనే గెలిస్తే గుట్టుచప్పుడు కాకుండా ఆ విజయం క్రెడిట్‌ను తనఖాతాలో వేసుకుని ఎంచక్కా ఆ నేత నీడలోనే ఉండొచ్చు. ఇలా కాకుండా ఎవరికోసమయితే కోవర్టు అవతారమెత్తారో వారే గెలిస్తే దర్జాగా మళ్లీ వారి దగ్గరకు వెళ్లిపోయి అక్కడా గెలుపు క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకునే ఉభయకుశలోపరి సౌలభ్యం కోవర్టులకు మాత్రమే ఉంది.

అందరూ మంచివారే.. కానీ..

అధికార పార్టీ మీద అసంతృప్తితో పాటు ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగానో, పార్టీల ఏకపక్ష ధోరణి నచ్చకనో పార్టీలు మారడం సహజం. ఇలా మారే వారిలో చాలా మంది నిజంగా నిండుమనసుతో పార్టీ మారేవారే. కానీ ఒకరిద్దరు మాత్రం కోవర్టు రాజకీయం చేస్తుంటారు. ఈ మొత్తంలో వారిని పసిగట్టడమే పార్టీలకు పెద్ద కోవర్ట్ పరీక్ష ప్రస్తుతం. ఒక్కోసారి నిబద్దత కలిగిన నేతనే పూర్వపక్షం చేసి కోవర్టుకే పెద్దపీట వేసే నేతాగణానికీ కొదవేలేదు. ఇలా జరిగితే దెబ్బకు పుట్టి మునగడం ఖాయమవడంతో పాటు తీరా ఫలితం వచ్చాక కోవర్టు దెబ్బకు రిజల్ట్ తారుమారు అయిందని ఎంత వగచినా ప్రయోజనం గుండుసున్నా. అందుకే నేతలూ కోవర్టులతో బహుపరాక్... జాగ్రత్త

నరేంద్రవర్మ గెలిస్తే నేను గెలిచినట్లే

- మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్

బాపట్ల, ఏప్రిల్ 18: బాపట్ల ఎమ్మెల్యేగా వేగేశన నరేంద్రవర్మను గెలిపిస్తే తనను గెలిపించినట్లేనని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ తెలిపారు. గురువారం బాపట్ల టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అన్నం సతీష్ మాట్లాడుతూ నరేంద్రవర్మతో 25 ఏళ్ల స్నేహం ఉందని, కలసి వ్యాపారం చేశామని తమ మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు లేవన్నారు. నరేంద్రవర్మతోపాటు ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణ ప్రసాద్ విజయం కోసం కృషి చేస్తానని చెప్పారు. కూటమికి టీడీపీ పెద్దన్న పాత్ర పోషించాలన్నారు. వచ్చేది ఎన్డీయే ప్రభుత్వమేనని, బాపట్లలో నరేంద్రవర్మ గెలుపు ఖాయ మన్నారు. అపోహలను తొలిగించుకుని, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎప్పుడూ ఒకే పార్టీ గెలుస్తూ ఉంటే వారి ఆగడాలకు హద్దు లేకుండా పోతుందన్నారు. అందువల్ల ఈ సారి ప్రజలు టీడీపీని గెలిపించుకోవాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అన్నం సతీష్‌ప్రభాకర్ పక్కన నరేంద్రవర్మ

మున్సిపల్ చైర్మన్ పదవి కాపులకు : వేగేశన

బాపట్ల మున్సిపల్ చైర్మన్ పదవి ఓసీలకు వస్తే కాపు సామాజిక వర్గానికి కేటాయిస్తామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నరేంద్రవర్మ తెలిపారు. ఉమ్మడి ప్రభుత్వంలో ఏక పక్ష నిర్ణయాలు ఉండవన్నారు. బాపట్ల మున్సిపాలిటీకి ఐదేళ్ల నుంచి ఎన్నికల జరపకుండా కమిషనర్‌ను అడ్డం పెట్టుకుని అనేక అవకతవకులకు పాల్పడ్డారన్నారు. పంచాయతీలను విలీనం చేసినట్లు చూపించి గ్రామాల్లో ఉపాధి పనులు లేకుండా చేశారని విమర్శించారు. ఎమ్మెల్యే కోనని గౌరవంగా ఇంటికి పంపేందుకు అన్ని పార్టీల వారితో కలిసి పనిచేస్తామన్నారు. పట్టణం, గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్య ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నాయని, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా స్పందన లేదన్నారు. ప్రభుత్వం పదివేలు ఇచ్చి పది రకాలుగా దోపిడీ చేస్తుందని విమర్శించారు.

సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్‌నారాయణ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, మనీయాదవ్, కృష్ణ చైతన్య టీడీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు, విన్నకోట వీరయ్యనాయడు, తోటనారాయణ, జనసేన నాయకులు శ్రీకృష్ణ ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

కోన రాగాలు!

- బాపట్లలో సినీ స్టూడియో ఏర్పాటు అంటూ కోన వెంకట్ ప్రకటన
- గతంలోనూ ఇదే హడావిడి, ఆచరణ శూన్యం
- ఎన్నికల జిమ్మిక్కుగా కొట్టిపారేస్తున్న ప్రజలు

బాపట్ల, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): సరిగ్గా ఎన్నికల వేళ బాపట్లలో సినీ స్టూడియో కట్టి ఉపాధి అవకాశాలు కల్పిస్తానంటూ సినీ నిర్మాత కోన వెంకట్ గురువారం మీడియా సమావేశంలో ప్రకటించడం చర్చకు దారి తీసింది. ఈయన బాపట్ల వైసీపీ ఎమ్మెల్యే కోన రఘుపతి బంధువు కావడంతో పాటు ఆయన గెలుపుకోసం విస్తృతంగా ప్రచారం కూడా చేస్తున్నారు. 2019 ఎన్నికల వేళ, తర్వాత కూడా బాపట్లలో స్టూడియో ఏర్పాటు అంటూ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారు. మధ్యలో రాజకీయ పరమైన కారణాలతో స్టూడియో నిర్మాణం అడుగులు ముందుకు పడలేదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికల వేళ స్టూడియో ఏర్పాటు అంశాన్ని తెరమీదకు తేవడంతో ఇవన్నీ ఓట్ల కోసం జిమ్మిక్కులేననని బాపట్ల ప్రజలు కొట్టిపారేస్తున్నారు.

సందట్లో సడేమియా!

- ప్రచారానికి ప్యాకేజీలు

మండు వేసవిలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో.. ప్రధాన పార్టీల అభ్యర్థులు విజయమే లక్ష్యంగా ఇప్పటికే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. డబ్బును మంచినీళ్లల్లా ఖర్చు పెడుతున్నారు. మరో మూడు వారాలు పాటు అభ్యర్థులకు ఈ పరిస్థితి తప్పేలా లేదు. ఇదే అవకాశంగా కొందరు సందట్లో సడేమియాలు రంగంలోకి దిగారు. పలు పార్టీల అభ్యర్థులను కలసి థర్డ్ పార్టీ ఏజెన్సీ కింద ఇన్‌స్టెంట్ ప్రచార బాధ్యతలు తాము నిర్వహిస్తామని కొత్త వ్యాపార కిటుకులు చెబుతున్నారు. దీనికి పలు ప్యాకేజీలు పెట్టారు. .రూ.3 లక్షలకు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి ఆ అభ్యర్థి ప్రచార కరపత్రాలు పంపిణీ చేస్తామని, రూ.5 లక్షలు ఇస్తే పలు యూట్యూబ్ ఛానల్ ద్వారా అభ్యర్థి ఎన్నికల ప్రచార ప్రకటనలు, ఇంటర్వ్యూలు ప్రసారం చేయిస్తామంటున్నారు. నేరుగా అభ్యర్థి వెంట ప్రచారంలో జనాలు పాల్గొనాలంటే ఒక్కో కార్యకర్తకు రోజుకు రూ.వెయ్యి చెల్లించాలని, భోజనం, టిఫిన్‌కు అదనపు చెల్లింపులు ఉంటాయని చెబుతున్నారు. రోజుకు ఎంత మందిని కావాలంటే అంత మందిని సమకూరుస్తామని, ముందుగా కొంత అడ్వాన్స్ చేతిలో పడేయమని ఒత్తిడి తెస్తున్నారు. తమది భలే మంచి చౌక బేరమంటున్నారు. వీరు చెబుతున్న ప్యాకేజీలకు అభ్యర్థులకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ఇక కొన్ని కుల సంఘాలు కూడా ఇదే అదనుగా భావించి రంగంలోకి దిగాయి. అధికార పార్టీ అభ్యర్థులను, సిటింగ్ ఎమ్మెల్యేలను వీరు లక్ష్యంగా చేసుకొని.. తమ సంఘం మీకే పూర్తి మద్దతు ఇస్తుందని, ఏదో మీకు తోచింది మా సంఘానికి ఫండింగ్ ఇవ్వాలని ఒత్తిడి తెస్తూ దొరికినకాడికి అందిపుచ్చుకుంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ దందా జోరుగా సాగుతోంది.

- గుంటూరు

బరిలోకి.. తొలిసారి

- ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 10 మంది రంగంలోకి

గుంటూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాజకీయ చైతన్యం కలిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా కొత్త తరం నాయకులకు వేదికగా మారింది. ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగు దేశం, వైసీపీలు రాజకీయ ఎత్తుగడలతో కొత్త వారికి అవకాశం కల్పించాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 10 మంది కొత్త అభ్యర్థులు ఈ సారి ఎన్నికల బరిలో నిలిచేందుకు ప్రధాన పార్టీలు అవకాశం కల్పించాయి. వారిలో గుంటూరు తూర్పు నుండి నూరి ఫాతిమా బరిలోకి దిగి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆమె తన తండ్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే ముస్తఫాకు వారసురాలిగా వైసీపీ అభ్యర్థిగా రంగప్రవేశం చేసింది. గుంటూరు పశ్చిమ నుంచి గళ్లా మాధవి అనూహ్యంగా బరిలోకి దిగారు. ఆమె కుటుంబానికి ఎటువంటి రాజకీయ నేపథ్యం లేకపోయినప్పటికీ కుల సమీకరణలో భాగంగా ఆమె అభ్యర్థిత్వాన్ని చంద్రబాబునాయుడు ఖరారు చేశారు. కమ్మ సామాజికవర్గం వారు ఈ సీటుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ ఇదే నియోజకవర్గం నుంచి వైసీపీ తరపున బీసీ సామాజికవర్గానికి చెందిన మంత్రి విడదల రజనీ బరిలోకి దిగటంతో టీడీపీ కూడా బీసీ సామాజికవర్గ మహిళనే ఎంపిక చేసింది. పెదకూరపాడు నుంచి భాష్యం ప్రవీణ్ యువత కోటాలో టీడీపీ టికెట్ దక్కించుకున్నాడు. మంగళగిరి నుండి వైసీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు కోడలు మురుగుడు లావణ్య ఎన్నికల బరిలోకి దిగారు. టీడీపీ అభ్యర్థి, యువనేత నారా లోకేశ్‌ను ఆమె ఢీ కొంటున్నారు. ప్రత్తిపాడు నుంచి వైసీపీ అభ్యర్థి స్థానికేతరుడైన బలసాని కిరణ్ కుమార్ బరిలోకి దిగారు. పొన్నూరు నుంచి మంత్రి అంబటి రాంబాబు సోదరుడు అంబటి మురళీకృష్ణ వైసీపీ అభ్యర్థిగా రంగ ప్రవేశం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే కిలారి రోశయ్యను గుంటూరు ఎంపీ అభ్యర్థిగా పంపటంతో మురళికి అవకాశం దక్కింది. చిలకలూరిపేట నుంచి గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు వైసీపీ అభ్యర్థిగా రంగప్రవేశం చేశారు. బాపట్ల నుంచి వేగేశన నరేంద్రవర్మ టీడీపీ అభ్యర్థిగా తొలిసారి ఎన్నికల బరిలోకి దిగారు. ఈ ఐదేళ్ళుగా ఆయన ఆ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తూ వచ్చారు. రేపల్లె నుంచి వైసీపీ అభ్యర్థిగా ఈవూరి గణేశ్‌ను బరిలోకి దింపారు. ఈ నియోజకవర్గంపై ఆధిపత్యం చెలాయిస్తున్న మోపిదేవి కుటుంబానికి గండి కొట్టి ఇతనికి అవకాశం కల్పించారు. వేమూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా వరికూటి అశోక్‌కుమార్ తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు.

టీడీపీలో చేరిన వలపర్ల బీసీ కుటుంబాలు


ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన వలపర్ల బీసీ కుటుంబాలు


మార్టూరులో ప్రచారం చేస్తున్న కూటమి శ్రేణులు

మార్టూరు, ఏప్రిల్ 18 : మండలంలోని వలపర్ల గ్రామంలోని 20 బీసీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారు గురువారం మండలంలోని ఏలూరి క్యాంప్ కార్యాలయంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. ఏలూరి వారికి కండువాలను వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ వలపర్ల గ్రామంలో టీడీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వలను నిర్మించినట్లు చెప్పారు. ఇకపై కూడా అభివృద్ధికి కృషి చేస్తానని ఏలూరి తెలిపారు. టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఏలూరి కోరారు. చేరినవారిలో తన్నీరు శివ, తన్నీరు వెంకటేష్, తన్నీరు వెంకయ్య, గుంజి సాయి వెంకటేష్, గుంజి పవన్, కుంచాల వీరాంజనేయులు, గుంజి సుబ్బారావు, తన్నీరు అనిల్, గుంజి ధనమూర్తి, లక్ష్మీనారాయణ, తన్నీరు అంకమ్మ, కుంచాల వెంకటేష్, తన్నీరు ఆకాష్, తన్నీరు గురు ప్రసాద్ ఉన్నారు. కార్యక్రమంలో కంభం పాటి హనుమంతరావు, గుంటి వెంకటేశ్వర్లు షేక్ బషీర్ పాల్గొన్నారు.

వలపర్లలో పార్టీ కార్యాలయం ప్రారంభం

మండలంలోని వలపర్ల గ్రామంలో గురువారం టీ డీపీ కూటమి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం బీసీ కాలనీలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావును, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కంభంపాటి హనుమంతరావు, షేక్ బషీర్, గుంటి వెంకటేశ్వర్లు, సుబ్బారావు, ఎస్‌పీ సలాం, గుద్దంటి శంకర్, రమేష్ , మోహనరావు పాల్గొన్నారు.

ఏలూరి నామినేషనుకు తరలిరండి

టీడీపీ కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ఈనెల 22వ తేదీన పర్చూరులో నామినేషన్ వేస్తున్నారని, ఈ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావాలని శ్రేణులు కోరారు. గురువారం మార్టూరులో పాత సినిమా హాలు వెనుక కాలనీలో కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి ఎమ్మెల్యేగా ఏలూరిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కామినేని జనార్దన్, షేక్ రజాక్, తాటి నాగేశ్వరరావు, శివనాగేశ్వరరావు, రమాదేవి, శేషకుమారి, భూలక్ష్మి, శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఏలూరి విజయాన్ని కాంక్షిస్తూ జోరుగా ప్రచారం

పర్చూరు : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గెలుపు కోసం ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో ప్రచారం జోరుగా సాగుతోంది. పర్చూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే ఏలూరి విజయం కోసం ప్రతిఒక్కరూ సహకరించాలని ప్రచారం చేస్తున్నారు. గురువారం పర్చూరులోని ప్రధాన వీధుల్లో ప్రచారం సాగింది. కార్యక్రమంలో టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కొల్లా శివరాం ప్రసాద్, కొండ్రగుంటి శివనాగేశ్వరావు, తులసి శ్రీనివాసరావు, ఆకుల మధుబాబు, గడ్డిపాటి శ్రీనివాసరావు, మల్లాది సురేష్, వడ్డెముక్కల అబ్రహాం, నలిగిల కిషోర్, మార్టూరు నాగరాజు, కొల్లా చౌదరి, పూరిమెట్ల జయమ్మ, ఊటుకూరి నిర్మల, సుబ్బమ్మ, జనసేనులు సందీప్ తేజ, దీర్ఘాల రమేష్, తులసి చంటి, అచ్చికోలు సతీష్, సుధాకర్ పాల్గొన్నారు.

చినగంజాం, సంతరావూరులో కూటమి ప్రచారం

చినగంజాం : చినగంజాం, సంతరావూరు గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావును సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కూటమి శ్రేణులు గురువారం రాత్రి ప్రచారం నిర్వహించారు. సాయిబాబా ఆలయంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చెరుకూరి రాఘవయ్య ఆధ్వర్యంలో, సంతరావూరు రామాలయంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మి ఆధ్వర్యంలో నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, నాయకులు అబ్దుల్ కలాంఅజాద్, మోటుమర్రి రామసుబ్బారావు, సందు శ్రీనివాసరావు, టీ.జయరావు. చేవూరి రవణమ్మ, నరహరి శ్రీనివాసరావు, గంటా చెన్నయ్య బెల్లంకొండ రమేష్‌బాబు, ఎం.పద్మావతి, షేక్ జిలాని, బాజీ అమీర్ఖాన్, సుభాని, రసూల్, పీ.శ్రీనివాసరావు, తుమ్మలపెంట చిన్నా, ఎం.రామాంజనేయులు, బడుగు సామ్యేలు, హుస్సేన్‌బాషా, జి.నరసింహారావు, సతీష్, సూరిబాబు, దుర్గారావు, జే.సంధ్యారాణి, కే.శ్యాంబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు అమరా మోహన్‌రావు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.


పర్చూరులో ఏలూరిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న శ్రేణులు


చినగంజాంలో ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

కూటమితోనే మంచి పాలన

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 18 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రజలకు మంచి పాలన అందుతుందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గురువారం రాత్రి అద్దంకి మండలంలోని శింగరకొండపాలెం, శింగరకొండలో గొట్టిపాటి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత అమలు చేసే పథకాలను, వాటి ప్రయోజనాలను గొట్టిపాటి వివరించారు. ఒక్క చాన్స్ అంటూ వచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని దోచేశారన్నారు. దోపిడీ, దౌర్జన్యం, అరాచక పాలన సాగించేవారికి మరో చాన్స్ ఇవ్వొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధి కోసం, పిల్లల భవిష్యత్ కోసం సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని గొట్టి పాటి పిలుపునిచ్చారు. టీడీపీ రాగానే బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామ న్నారు. పైగా రూ.4వేలకు పింఛన్ పెంచినట్లు తెలి పారు. బీసీల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తామన్నారు. చంద్రన్న బీమా రూ.10 లక్షలతో పునరుద్ధరిస్తామన్నారు. టీడీపీ, వైసీపీ పాలనలో ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించా లన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనని, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమం లో ఆయా గ్రామాల టీడీపీ నాయకులతో పాటు, మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు అధిక సం ఖ్యలో పాల్గొన్నారు.


సైకిల్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న గొట్టిపాటి


గొట్టిపాటికి హారతులిస్తున్న మహిళలు

5, 16 వార్డుల్లో టీడీపీ శ్రేణుల ప్రచారం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 18 : కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ నామినేషన్ కార్యక్రమానికి వార్డులోని ప్రజలందరూ అధిక సంఖ్యలో తరలిరావాలని టీడీపీ వార్డు నాయకులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని 5, 16 వార్డుల్లో టీడీపీ నాయ కులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో అభ్యర్థి గొట్టిపాటి నామినేషన్ దాఖలు చేయనున్నారని, ఆ కార్యక్రమాన్ని అభిమానులు విజయవంతం చేయాలని కోరారు. అనంతరం టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమాల్లో 5వ వార్డులో టీడీపీ నాయకులు వడ్లవల్లి పూర్ణచంద్రరావు, గొట్టిపాటి రవికుమార్ బావమరిది కామేపల్లి బ్రహ్మనాయుడు, గార్లపాటి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ చిలుకూరి సంధ్యారాణి, అనిల్, పొన్నలూరి కిరణ్‌కుమార్, రామిశెట్టి రవి, వెంకట్రావు, రంజిత్, సుబ్బారావు, శివకృష్ణతో పాటు 16 వార్డులో బీసీ నాయకులు యర్రాకుల రామాంజనేయులు, మాజీ ఎంపిపి మన్నెం ఏడుకొండలు, అద్దంకి నరేష్, బైరపునేని మోహనరావు, అమర్, గుండెమెడ సుబ్బారావు, కొండమ్మ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


5వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

నేడు గొట్టిపాటి నామినేషన్

భారీగా తరలిరానున్న అభిమానులు

అద్దంకి , ఏప్రిల్ 18 : కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. అద్దంకి పట్టణంలోని భవాని సెంటర్ నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్, పాత బస్టాండ్, మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి రానుంది. ఈ ర్యాలీకి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గొట్టిపాటి అభిమానులు తరలి రానున్నారు. ఈ మేరకు ఇప్పటికే గ్రామ స్థాయి నుంచే ఏర్పాట్లు జరిగాయి. ర్యాలీకి తరలి వచ్చే నేతలకు, కార్యకర్తలకు అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్డు, శింగరకొండ రోడ్డు, కలవకూరు రోడ్డులలో భోజన ఏర్పాట్లు చేశారు.


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రారంభమైన నామినేషన్ల పర్వం

» తొలి రోజు స్వతంత్ర అభ్యర్థి దాఖలు

» పోలీసుల పటిష్ఠ బందోబస్తు

చీరాలటౌన్, ఏప్రిల్ 18 : అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. మొదటి రోజు స్వతంత్ర అభ్యర్థిగా పొలిశెట్టి శ్రీనివాసరావు ఒక్కరే నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈనెల 25 వరకు నామినేషన్‌లను స్వీకరిస్తారు. ఆర్వో కార్యాలయానికి నాలుగు వైపులా సుమారు 100 మీటర్ల దూరం వరకు పోలీసులు ఆంక్షలు విధించారు. సీఐలు శేషగిరిరావు, సోమశేఖర్ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో పరిసర ప్రాంత ప్రజలు రాకపోకలకు అసంతృప్తి చెందారు.

పర్చూరు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. కట్టుదిట్టమైన పోలీసు వలయం మధ్య అధికారులు నామినేషన్‌ను స్వీకరించారు. తొలిరోజు బహుజన సమాజ్‌వాది పార్టీ (బీఎస్పీ) పర్చూరు అసెంబ్లీ అభ్యర్థిగా తమ్ములూరి వెంకటరత్నం మొదటి నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ నేతృత్వంలో నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. శాంతి భద్రతకు ఎలాంటి విఘాతం వాటిల్లకుండా పోలీసు కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు. కార్యాయానికి వందమీటర్ల దూరం నుంచి అభ్యర్థితోపాటు మరో నలుగురు వ్యక్తులకు మాత్రమే అనుమతి కల్పించారు.


నామినేషన్ పత్రాన్ని అందిస్తున్న బీఎస్పీ అభ్యర్థి

లక్ష్యం కోసం పట్టుదలతో చదవాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 18 : అనుకున్న లక్ష్య సాధన కోసం పట్టుదలతో ఇష్టపడి చదవాలని సివిల్స్ ర్యాంకర్ జగన్నాథం రాహుల్ అన్నారు. పూర్వ విద్యార్థి అయిన రాహుల్‌ను గురువారం అద్దంకిలోని భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ జీవీవీఆర్ శాస్త్రి, జోనల్ ఇన్‌చార్జి సాయి గణేష్ సన్మానించారు. ఈ సందర్భంగా సివిల్స్‌లో 873 ర్యాంక్ సాధించిన జగన్నాథం రాహుల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో, పోటీ పరీక్షల్లో ఎలా రాణించాలో తెలిపారు. అనంతరం రాహుల్‌ను, అతని తల్లి ప్రభావతిని శాలువతో, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రాహుల్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

ఉద్యోగిని మోసగించిన వ్యక్తిపై ఫిర్యాదు

చీరాలటౌన్, ఏప్రిల్ 18 : సస్పెండ్ అయిన ప్రభుత్వ ఉద్యోగికి తిరిగి అదేస్థానంలో పోస్టింగ్ ఇప్పిస్తామని మోసగించిన ఘటనపై చీరాల వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. అందిన వివరాల మేరకు.. చీరాల పరిధిలోని ఓ ప్రభుత్వ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగి సస్పెండ్ అయ్యారు. ఆయనకు పరిచయమైన ఓ వ్యక్తి తిరిగి పోస్టింగ్ ఇప్పిస్తానని నబమ్మబలికి రూ.80 వేలు వసూలు చేశారు. నెలలు గడుస్తున్నా ఆర్డర్ కాపీ ఇప్పించకపోవడంతో మోసపోయిన విషయాన్ని గ్రహించిన బాధితుడు చీరాల వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

భర్త కోసం భార్య.. తండ్రి కోసం కుమార్తె పూజలు

చీరాల, ఏప్రిల్ 18 : బరిలో ఉన్న అభ్యర్థుల విజయానికి వారి కుటుంబ సభ్యులు శ్రమిస్తు న్నారు. ఓ వైపు ప్రచారాలు, మరో వైపు పూజ ల్లో బిజీ బిజీగా కన్పిస్తున్నారు. టీడీపీ, జనసే, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ గెలుపు కోసం ఆయన సతీమణి తెన్నేటి శిరీష, ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య విజయం కోసం ఆయన కుమార్తె శివనారాయణదేవి తమవంతు పాత్రను పోషిస్తున్నారు. గురువారం పలుదేవాలయాల్లో వారు పూజలు నిర్వహించారు. కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గెలవాలని కోరుకున్నారు. ఆయా సందర్భాల్లో పనిలో పనిగా స్థానిక ప్రజలు, భక్తులతో సైకిల్ గుర్తుపై ఓట్లేసి కూటమి అభ్యర్థులను గెలిపిం చాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ముందుగా పట్టణంలోని పాపరాజు తోటలో ఉన్న సాయిబాబా ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత పేరాల శివాలయం, సాయిబాబాగుడి, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఎంపీగా టీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేగా కొండయ్య గెలుపొందాలని గోత్రనామాలతో అభిషేకాలు, అర్చనలు చే యించారు. ఆ తరువాత మండల పరిధిలోని ఈపురుపాలెం రాములవారి ఆలయం లో పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. తమ వారిని గెలిపించేందుకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేత డాక్టర్ సజ్జా హేమలత, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సాయిబాబా ఆలయంలో కూటమి ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ భార్య శిరీష, ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య కుమార్తె శివ నారాయణదేవి పూజలు


గౌరీఅమర్‌నాథ్‌తో 18,19 వార్డుల యువకులు

సైకిల్‌కే ఓటేస్తాం

18, 19 వార్డుల్లో నూతనంగా ఓటు హక్కు పొందిన యువకులు

చీరాల, ఏప్రిల్ 18 : మొదటిసారిగా ఓటు హక్కు పొందాం. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కొండయ్యకే ఓటు వేసి సైకిల్ గుర్తును ఆదరిస్తామని 18, 19 వార్డుల యువకులు స్పష్టం చేశారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య కుమారుడు గౌరీఅమర్‌నాథ్‌ను నూతన ఓటర్లు కలిసి సంఘీభావం తెలిపారు. వారి మెడలో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన అమర్‌నాథ్ కూటమి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమికే బీసీ సంఘం మద్దతు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 18: రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు ఈ ఎన్నికల్లో బీసీ సంక్షేమ సంఘం మద్దతును ఎన్డీఏ కూటమికి ఇస్తుందని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ తెలిపారు. గురువారం అద్దంకి వచ్చిన ఆయన స్థానిక బీసీ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం దక్కినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం వచ్చినట్లన్నారు. జగన్‌రెడ్డి అస్తవ్యస్త పాలనతో రాష్ట్రం సంక్షోభంలో నిలిచిందని, చేతి వృత్తులైన బీసీలకు సముచిత స్థానం కల్పించి, వారి అభ్యున్నతికి కృషి చేయని వైసీపీని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆదేశాల మేరకు టీడీపీ కూటమి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు రవి చంద్రాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసచారి, జిల్లా కార్యదర్శి ఎస్‌ఎస్‌పీ రాజు ఉన్నారు.


మాట్లాడుతున్న బీసీ సంఘ నేత రవికుమార్

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 18 : గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యద్దనపూడి గ్రామానికి చెందిన వృద్ధుడు ఉసుళ్ల బాబూరావు (65) బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ జీవీఎస్ చౌదరి గురువారం తెలిపారు. అతనికి భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ నెల 13 వతేదీన కడుపునొప్పితో బాధ పడుతున్న బాబూరావు ఇంటిలో ఎలుకలు మందు ఉన్న బిస్కట్లను తినడంతో అనారోగ్యానికి గురయ్యారు. అతనిని కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాబూరావు మృతి చెందారు. అతని భార్య శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించి, మృతదేహానికి పోస్టు మార్టమ్ నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. గురువారం సాయంత్రం మృత దేహాన్ని యద్దనపూడి గ్రామానికి తీసుకువచ్చారు.

108లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 18: 108 అంబులెన్స్ వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటి), పైలెట్ లేదా డ్రైవర్, అలాగే తల్లీ బిడ్డా ఎక్స్‌ప్రెస్‌లో డ్రైవర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బాపట్ల జిల్లా మేనేజర్ పీ బాలకృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈఎంటీ జీఎన్ఎం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు చేసిన వారు ఉద్యోగాలకు అర్హులని పేర్కొన్నారు. పైలెట్, డ్రైవర్ పోస్టులకు సంబంధించి తప్పని సరిగా 10వ తరగతి ఉత్తీర్ణతతోపాటు, హెవీ లైసెన్స్, 35 సంవత్సరాల కంటె తక్కువ వయస్సు కలిగి ఉండాలన్నారు. ఇంగ్లీష్ చదవడం, రాయడం తెలిసి ఉండాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 21వ తేదీలోపు 108 కార్యాలయంలో నేరుగా దరఖాస్తులు అందించాలన్నారు. లేదా 108 ఆఫీస్, రూమ్ నెంబరు 25, చీరాల గవర్నమెంట్ ఏరియా హస్పిటల్‌లో అందజేయాలన్నారు. వివరాలకు 8309530078, 8885107040 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మూణ్నాళ్ల ముచ్చటగా సాగర్ జలాలు

మార్టూరు, ఏప్రిల్ 18 : సాగర్ జలాలు వస్తున్నాయని.. మంచినీటి చెరువులు నిండి మన తాగు నీటి కష్టాలు తీరుతాయని గ్రామస్థులు ఎంతో ఆశపడ్డారు. అయితే వారి ఆశలు నీరుగారాయి. బుధవారం సాయంత్రానికే సాగర్ జలాల రాక ఆగిపోయింది. కేవలం మూడు రోజులు మాత్రమే జలాలు రావడంతో మంచి నీటి చెరువులకు అరకొరగా చేరాయి. మండలంలో మిగిలిన గ్రామాల పరిస్థితి కన్నా మేజరు పంచాయతీ మార్టూరు మంచి నీటి చెరువుకు ఈ వేసవిలో తాగు నీటి ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాగర్ జలాలతో చెరువును నింపుకోవాలని రాజుపాలెం మేజరు నుంచి మార్టూరు చెరువు వరకు సాగర్ మైనరు కాలువను అక్కడక్కడా పంచాయతీ వారు మరమ్మతు పనులు చేశారు. వీలైనంత వేగంగా చెరువును నింపుకోవడానికి చెరువులో అదనంగా మోటార్లతో పాటు అన్ని ఏర్పాట్లు చేశారు. కానీ ముచ్చటగా మూడు రోజులు మాత్రమే నీళ్ల రావడంతో చెరువులకు ఒక మాదిరిగా కూడా సాగర్ జలాలు చేర లేదు. వాస్తవంగా 40 రోజుల పాటు నీరు వస్తేనే చెరువు నిండుతుంది. అలాంటిది కేవలం మూడు రోజులు మాత్రమే నీళ్ల రావడంతో చెరువులో చాలా తక్కువగా నీటి నిల్వలు కన్పిస్తున్నాయి. ఇక మండలంలో సాగర్ కాలువకు దగ్గరలో ఉన్న వలపర్ల, కోనంకి, జొన్నతాళి చెరువులకు ఒక మాదిరిగా సాగర్ జలాలు చేరాయి. అయితే ఎన్ఎస్‌పీ అధికారులు మరలా రెండు మూడు రోజులలో సాగర్ జలాలు వస్తాయని చెప్తున్నారు. ఏదిఏమైనా ఏమైనా ఈ వేసవిలో కొన్ని గ్రామాలలో తాగు నీటి ఇబ్బందులు తలెత్తే అవకాశంతో పాటు, గ్రామాలలో భూగర్భ జలాలు అడుగంటే అవకాశం ఉందని పరిసర గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.


మార్టూరు చెరువుకు అరకొరగా చేరిన జలాలు


టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ

మార్టూరు, ఏప్రిల్ 18 : జాతీయ రహదారిపై మండల పరిధి బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద హైవేపై వెళ్లే వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఒంగోలు వైపు, గుంటూరు వైపు వెళ్లే వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఎన్నికలు సందర్భంగా మద్యం, నగదును తదితర వాటిని పార్టీల నాయకులు, వ్యక్తులు అక్రమంగా తరలిస్తారన్న కారణంగా పోలీసులు వాహనాలను సోదా చేస్తున్నారు. ఎస్ఎస్ టీమ్ దయాసాగర్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ శ్రీహరి బృందంతో వాహనాల తనిఖీ ప్రక్రియ వారం రోజుల నుంచి చేస్తున్నారు.

పొగాకు దొంగతనాలపై రెండు కేసులు

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 18 : యద్దనపూడి మండలం గన్నవరం, చిమటావారిపాలెం గ్రామాలలో పొలాల్లో కర్ర పందిళ్లపై ఉంచిన పొగాకు కట్టలను గుర్తు తెలియని వ్యక్తులను దొంగిలించారని స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు గురువారం ఎస్ఐ జీవీఎస్ చౌదరి తెలిపారు. రెండు రోజుల కిందట గన్నవరంలో పత్తిపాటి రాంబాబు అనే వ్యక్తి పొలంలో రాత్రి సమయంలో రూ.లక్ష విలువైన 10 క్వింటాళ్ల పొగాకును, చిమటా వారిపాలెం లో టంకసాల వెంకటరత్నంకు చెందిన పొలంలో రూ.80 వేల విలువైన 8 క్వింటాళ్ల పొగాకును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకు పోయారు. ఆ ఇద్దరు రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మాయమాటలతో బాలికపై లైంగిక దాడి

ఫోక్సో కేసు నమోదు

బల్లికురవ, ఏప్రిల్ 18 : రోజువారీ పనులకు వెళుతున్న బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడి చేసిన కూకట్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ జొన్నలగడ్డ అవినాష్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఆటో డ్రైవర్ జొన్నలగడ్డ అవినాష్ ఆటోలో రోజూ బాలిక కూలి పనులకు వెళుతోంది. 15వ తేదీన పనులకు వెళ్లిన బాలికను డ్రైవర్ ఇంటికి తీసుకురాకుండా ఇతర ప్రాంతానికి తీసుకు వెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మరుచటి రోజు బాలికను తీసుకొచ్చాడు. ఎక్కడికి వెళ్లావని బాలిక కుటుంబ సభ్యులు ప్రశ్నించడంతో విషయం చెప్పింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫోక్సో కేసు నమదు చేసినట్లు తెలిపారు.

వలంటీర్ల రాజీనామా

మార్టూరు, ఏప్రిల్ 18 : యద్దనపూడి మండలంలో గురువారం మూడు గ్రామాలలో 12 మంది వలంటీర్లు రాజీ నామా చేసినట్లు ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం తెలిపారు. యనమదలలో 7 గురు, పూనూరులో 4 గురు, పోలూరులో ఒకరు రాజీనామా చేసినట్లు తెలిపారు. మొత్తం 159 మందికిగాను 70 మంది రాజీనామా చేసినట్లు తెలిపారు. వలపర్లలో గురువారం 33 మంది వలంటీర్లు రాజీ నామా చేసినట్లు ఎంపీడీవో నితిన్ తెలిపారు. దీంతో రాజీనామా చేసిన వారి సంఖ్య 136కు చేరిందని తెలిపారు. మొత్తం 368 మంది వలంటీర్లు ఉన్నారు.

బధిరుల పాఠశాలకు ఫ్యాన్ల బహూకరణ

పర్చూరు, ఏప్రిల్ 18 మండల పరిధిలోని నాగులపాలెం గ్రామంలోని బధిరుల పాఠశాలకు రోటేరియన్ కోడూరి సుబ్రహ్మణ్యాచారి సమకూర్చిన సీలింగ్ ఫ్యాన్‌లను గురువారం అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు చేతులమీదుగా ఫ్యాన్లను అందజేశారు. కొమ్మాలపాటి మనోజ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా బధిర విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, పాబోలు ఉదయభాస్కర్, తోకల కృష్ణమోహన్, కాసా అశోక్ కుమార్, కోటా శ్రీనివాసరావు, మున్నంగి వెంకట సుబ్బయ్య, అగ్నిగుండాల వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.


బధిర విద్యార్థులతో రోటరీ సభ్యులు